ANN తెలుగు

Follow: @ANNTELUGU

05-07-2025

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ | సంపుటి- 22 | సంచిక- 211 | పేజీలు-08 | వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI | REGISTERED NUMBER: APTEL/2003/09316 | WWW.EPAPER.MAHAADAILY.COM



## సరిహద్దులో భారత్‌కు ముగ్గురు శత్రువులు

### చైనాకు లైవ్ ల్యాబ్‌లా మారిన పాక్

భారత డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ రాహుల్ ఆర్ సింగ్

**ఢిల్లీ, మహా:** భారత్‌కు ఒక సరిహద్దులో ఏకంగా ముగ్గురు విరోధులు ఉన్నారని డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ (సామర్థ్యాల పెంపు, నిర్వహణ సహకారం) లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్.సింగ్ అన్నారు. బార్డర్‌లో ఎదురుగా పాకిస్థాన్ కనిపిస్తున్నప్పటికీ, దాని వెనుక చైనా ఉందని ఆయన తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ ) ఆధ్వర్యంలో 'న్యూ ఏజ్ మిలిటరీ టెక్నాలజీస్' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో రాహుల్ ఆర్.సింగ్ ప్రసంగించారు. పాక్ వినియోగిస్తున్న సైనిక ఉత్పత్తుల్లో 81 శాతం చైనావే అని రాహుల్ ఆర్. సింగ్ అన్నారు. భారత్‌తో సైనిక ఘర్షణ జరిగినప్పుడల్లా పాక్‌కు చైనా నుంచి అన్ని రకాల సాయం, సైనిక టెక్నాలజీ అందుతోందన్నారు. మిగతా 2లో

**టాప్ న్యూస్**

### త్వరలో మరో ఉద్యోగ నోటిఫికేషన్

- హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో 2 వేల జాబ్స్‌కు లైన్ క్లియర్
- ఖాళీ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి మంజూరు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల విస్తరణకు ప్రణాళిక

02

### కాంగ్రెస్ దోపిడీకి తెలంగాణ అక్షయపాత్ర

- సామాజిక న్యాయానికి తూట్లు పొడిచేందుకే సభ
- ఖర్గే సభపై టీ-బీజేపీ చీఫ్ రామచందర్‌రావు విమర్శలు



02

### 90 సీట్లతో మళ్లీ అధికారంలోకి పక్కా


- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



02



## మోదీ తెలంగాణకు ఏమిచ్చావ్?



### దేశ ప్రజలకు ప్రధాని చెప్పేవన్నీ అబద్ధాలే

### బీహార్ ఎన్నికలపై ఉన్న శ్రద్ధ దేశ భద్రతపై లేదు

- 42 దేశాలు తిరిగిన ప్రధానికి మణిపూర్ వెళ్లే తీరిక లేదా?
- ఇందిర పాకిస్థాన్‌ను రెండు ముక్కలు చేస్తే మీరేమీ చేశారు?
- కాంగ్రెస్ మద్దతిచ్చినా ట్రంప్ చెప్తే పాకిస్థాన్‌తో యుద్ధాన్ని ఆపేశారు
- దేశం కోసం బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నుంచి ఒక్కరైనా ప్రాణాలు అర్పించారా?
- కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తాం.. దేశాన్ని కాపాడతాం
- 'కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి' సభలో ఏఐసీసీ చీఫ్ ఖర్గే

**హైదరాబాద్, మహా:** ప్రధాని మోదీ, అమిత్‌షా అబద్ధాలు చెప్పి కేంద్రంలో అధికారంలోకి వచ్చారని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కారణం కార్యకర్తలేనని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. ఇలా అందరూ కలిసికట్టుగా భారత రాష్ట్ర సమితిని ఓడించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని చెప్పారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన 'కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి' సభలో ఖర్గే మాట్లాడారు. 'గతంలో రైతులు, మహిళలు, నిరుద్యోగులను కేసీఆర్ మోసం చేశారు. ప్రధాని మోదీ, అమిత్‌షా అబద్ధాలు చెప్పి కేంద్రంలో అధికారంలోకి వచ్చారు. మిగతా 2లో

## మోదీ వస్తారో.. కేసీఆర్ వస్తారో రండి..



### రైతు రాజ్యం ఎవరిదో చర్చ పెడదాం

- ఢిల్లీలో ఉండే మోదీ అయినా.. గల్లీలోని కేడీ అయినా
- 60 వేల ఉద్యోగాలకు ఒక్కటి తగ్గినా క్షమాపణ చెప్తా
- బీఆర్‌ఎస్, బీజేపీ లీడర్లకు సీఎం రేవంత్ రెడ్డి ఓపెన్ ఛాలెంజ్
- వచ్చే ఎన్నికల్లో 15 ఎంపీ సీట్లు, 100 అసెంబ్లీ సీట్లు గెలుస్తాం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకునే బాధ్యత నాది
- సోషల్ మీడియాలో యుద్ధం చేస్తే కల్వకుంట్ల గడీ తునాతునకలవ్వాలె

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు అవుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసి, వ్యవసాయాన్ని దండుగ నుంచి పండుగగా మార్చిన ఘనత తమదంటూ ఆయన గర్వంగా వెల్లడించారు. 24 గంటల ఉచిత కరెంట్, రుణ మాఫీ సహా రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి తెలంగాణ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రైతుల శ్రేయస్సు కోసం చేసిన పనులపై బహిరంగ చర్చకు రావాలని బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలకు రేవంత్ సవాల్ చేశారు. మిగతా 2లో



### గ్రీన్ ట్రాన్స్‌ఫర్మేషన్ దిశగా అడుగులు

- ఖనిజాల ఉత్పత్తిలో కోల్ ఇండియా కీలక పాత్ర
- కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి
- వరల్డ్ మైనింగ్ కాంగ్రెస్ సదస్సుకు హాజరు

**హైదరాబాద్, మహా:** గ్రీన్ ట్రాన్స్‌ఫర్మేషన్ దిశగా మోదీ ప్రభుత్వం అడుగులు వేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందుకోసం కోల్ గ్యాసిఫికేషన్, రెన్యూవబుల్ ఎనర్జీ డైవర్సిఫికేషన్, పెద్దమొత్తంలో మొక్కల పెంపకం, తవ్వకం పూర్తయిన గనుల రీపర్పసింగ్ వంటివాటిపై మోదీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పుకొచ్చారు. మిగతా 2లో

## ఈడీ విచారణకు అల్లు అరవింద్!

### బ్యాంకు స్కామ్ కేసులో నిర్మాతకు నోటీసులు

రూ.101 కోట్ల రుణాలను మోసపూరితంగా మళ్లించారన్న ఆరోపణలు

బ్యాంకు లావాదేవీలు, ఆస్తుల కొనుగోలుపై వివరాలపై ఆరా


**హైదరాబాద్, మహా:** టాలీవుడ్ ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ శుక్రవారం ఈడీ విచారణకు హాజరయ్యారు. రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ బ్యాంక్ స్కామ్‌లో అల్లు అరవింద్‌ను ఈడీ విచారించింది. బ్యాంకులో 2018 19లో జరిగిన ఆర్థిక అవకతవకలకు సంబంధించి సుమారు మూడు గంటల పాటు ఆయనను అధికారులు ప్రశ్నించారు. అయితే యూనియన్ బ్యాంకు నుంచి రూ. 101 కోట్ల రుణాలను రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ బ్యాంకు తీసుకుంది. తీసుకున్న రుణాలను తిరిగి సకాలంలో చెల్లించకపోవడంతో సీబీఐ కేసు నమోదు చేసింది. మిగతా 2లో



### నటి రన్యారావుకు షాకిచ్చిన ఈడీ..

#### రూ.34 కోట్ల ఆస్తులు సీజ్

**మహా:** కన్నడ నటి రన్యారావు కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దిమ్మతిరిగే షాకిచ్చింది. గోల్డ్ స్మగ్లింగ్ వ్యవహారం ఆమెపై నమోదైన మనీ లాండరింగ్ మిగతా 2లో



## ఆస్పత్రి నుంచే కేసీఆర్ రివ్యూ

- పరామర్శకు వచ్చిన నేతలతో ప్రజా సమస్యలపై చర్చ
- యూరియా కొరత, బనకచర్ల అంశంపై నేతల నుంచి ఫీడ్‌బ్యాక్
- సమావేశంలో కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు ముఖ్య నేతలు



**హైదరాబాద్, మహా:** బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రిలో చేరినప్పటికీ రాష్ట్ర రాజకీయాలు, ప్రజా సమస్యలపై దృష్టి సారించారు. సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం తనను పరామర్శించేందుకు మిగతా 2లో

### సీఎం అభ్యర్థిగా విజయ్

02

- బీజేపీ, డీఎంకేలతో పొత్తులు ఉండవు
- తమిళగ వెట్రి కళగం(టీవీకే) కీలక ప్రకటన
- వచ్చే నెలలో భారీ ఎత్తున రాష్ట్ర మహాసభలు నిర్వహణ



### ఇక పదవుల జాతర

- సీఎంకు జాబితా ఇవ్వాలని ఇంచార్జి మంత్రులకు ఖర్గే ఆదేశం
- మార్కెట్ కమిటీలు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఆలయ పాలకమండళ్ల పోస్టుల భర్తీ
- గ్రంథాలయ, వక్ఫ్, ఆత్మ కమిటీలు, అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీలు కూడా
- వెంటనే సీఎంకు జాబితా ఇవ్వాలని ఇన్ చార్జి మంత్రులకు ఏఐసీసీ చీఫ్ ఖర్గే ఆదేశం

02




## 90 సీట్లతో మళ్లీ అధికారంలోకి పక్కా

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్, మహా :** 90 సీట్లతో మళ్లీ అధికారంలోకి రావడం పక్కా అని కాంగ్రెస్ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ భవన్లో ఏర్పాటు చేసిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు, చేసిన అభివృద్ధితో పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని అన్నారు. అగ్రవర్ణాలకు చెందిన రేవంత్ రెడ్డి సీఎం, బీసీనైన తనకు పీసీసీ చీఫ్ పదవి ఇచ్చారని, నలుగురు దళితులకు క్యాబినెట్ లో చోటు దక్కిందని అన్నారు. మరో దళిత బిడ్డకు స్పీకర్ పదవి ఇచ్చి గౌరవించిందని వ్యాఖ్యానించారు. కొత్తగా నియమితులైన పార్టీ నేలకు పార్టీ చక్కటి అవకాశం కల్పించిందని దానిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

## ఈడీ విచారణకు అల్లు అరవింద్!



(మొదటిపేజీ తరువాయి)

సీబీఐ కేసు ఆధారంగా దీనిని ఈడీ దర్యాప్తు చేపట్టింది. రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ నుంచి అల్లు సంస్థలు లావాదేవీలు జరిపినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. దీంతో ఈ కేసులో ఈడీ అల్లు అరవింద్‌ను విచారించింది. బ్యాంకులో జరిగిన ఆర్థిక అవకతవకలలో అల్లు అరవింద్‌కు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో విచారణ చేశారు. బ్యాంకు లావాదేవీలు, ఆస్తుల కొనుగోలుపై వివరాలను ఈడీ అడిగి తెలుసుకుంది. వచ్చే వారం మరోసారి విచారణకు హాజరు కావాలని ఈడీ అల్లు అరవింద్ ను ఆదేశించింది.

## నటి రన్యారావుకు షాకిచ్చిన ఈడీ..

**రూ.34 కోట్ల ఆస్తులు సీజ్**

(మొదటిపేజీ తరువాయి)

కేసులో తాజాగా రూ.34.12 కోట్ల విలువైన ఆస్తులను శుక్రవారం అధికారులు జప్తు చేశారు. కాగా, రన్యారావు మార్చి 3, 2025న బెంగళూరు లోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో దుబాయ్ నుంచి రూ.12.56 కోట్ల విలువైన 14.2 కేజీల బంగారు బిస్కెట్లను శరీరంపై బ్యాండేజీలతో దాచి స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడింది. దీంతో ఆమెపై ఈడీ మనీ లాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేసింది. అనంతరం రన్యారావు నివాసంలో జరిపిన సోదాల్లో రూ.2.06 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, రూ.2.67 కోట్ల లిక్విడ్ క్యాష్ కూడా లభించింది. నవంబర్ 2024 నుంచి ఫిబ్రవరి 2025 వరకు రన్యారావు రూ.40.13 కోట్ల విలువైన 49.6 కేజీల స్మగ్లింగ్ బంగారాన్ని హవాలా డీలర్ సాహిల్ సకరియా జైన్ సాయంతో ఇతర దేశాలకు విక్రయించినట్లుగా దర్యాప్తులో వెల్లడైంది. నిందితురాలు రన్యారావు నకిలీ కన్సల్టెన్సీ ఫీజులు, షెల్ కంపెనీల ద్వారా రూ.కోట్లలో అక్రమార్జనకు పాల్పడినట్లుగా నిర్ధారణ అయింది. దీంతో కేసులో హవాలా లావాదేవీలు, వాటి నెట్‌వర్క్‌ను ఛేదించేలా ఈడీ అధికారులు ముమ్మర దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

## ఆస్పత్రి నుంచే కేసీఆర్ రివ్యూ

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన పార్టీ ముఖ్య నేతలతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులపై ఆయన ఆసుపత్రిలోనే సుదీర్ఘంగా చర్చించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయనను పరామర్శించేందుకు కేటీఆర్, హరీశ్ రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు ఆసుపత్రికి తరలివచ్చారు. ఈ సందర్భంగా వారితో ముచ్చటించిన కేసీఆర్, రాష్ట్రంలోని రైతుల ఇబ్బందులు, వ్యవసాయ రంగంలోని సంక్షోభం, సాగునీటి సమస్యలు వంటి అంశాలపై ఆరా తీశారు. ముఖ్యంగా, రైతులకు యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోందని, బనకచర్ల విషయంలో ప్రభుత్వ వైఖరి సరిగ్గా లేదని పలువురు నేతలు కేసీఆర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలుస్తోంది. నేతలు వెల్లడించిన క్షేత్రస్థాయి వివరాలను కేసీఆర్ ఓపికగా విన్నారు. ప్రస్తుత పరిణామాలపై వారి నుంచి అభిప్రాయాలు, ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు.

# మోదీ తెలంగాణకు ఏమిచ్చావ్?

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. హైదరాబాద్‌కు మోదీ చేసింది శూన్యం. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం అందిస్తోంది. రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో రూ.8,200 కోట్లు జమ చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తోంది. గిగ్ వర్కర్ల హక్కుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకొస్తోంది. దేశంలో తొలిసారి కులగణన చేపట్టింది తెలంగాణ ప్రభుత్వమే. బీసీల రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోంది.

**రేవంత్ పాలన సూపర్..**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బాగా పని చేస్తోందని మల్లికార్జున ఖర్గే కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు. రైతు రుణమాఫీ, మహిళలకు ఫ్రీ బస్, సన్న బియ్యం వంటి అనేక పథకాలు హామీలు విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. దేశంలో రేషన్ ద్వారా సన్న బియ్యం ఇచ్చే ఏకైక రాష్ట్రం ఒక్క తెలంగాణ మాత్రమేనని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి రాగానే కులగణన చేశామని.. రాహుల్ చెప్పిన మాటకు ఇదే నిదర్శమని పేర్కొన్నారు. 'కేసీఆర్, బీజేపీ కలిసి తెలంగాణలో కాంగ్రెస్ ను అడ్డుకుంటామన్నారు. కానీ తెలంగాణ ప్రజలు ఈ రెండు పార్టీలను ఓడించారు. తెలంగాణలో కాంగ్రెస్ గెలుస్తుందని గతంలో చెప్పాను. కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణలో 50కి పైగా కేంద్ర సంస్థలు వచ్చాయి. ప్రధాని మోదీ తెలంగాణకు 11 ఏళ్లలో ఏం ఇచ్చారు? మోదీ ప్రజలకు చెప్పేవన్నీ అబద్ధాలే' అని వ్యాఖ్యానించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందన్నారు.



**మోదీకి దేశ భద్రతపై శ్రద్ధ లేదు..**

'రేవంత్ సర్కార్ రైతు భరోసా కింద రూ.8200 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేసింది. కాంగ్రెస్ ఏం చెప్పిందో అవన్నీ చేసి చూపించింది. దేశంలో తొలిసారి కులగణన చేపట్టింది తెలంగాణలోనే.. మోదీ, అమిత్ షా చాలా చాలా చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారు. కానీ వాళ్లు ఈ దేశానికి, తెలంగాణకు చేసిందేమిటి? నెహ్రూ, ఇందిరా హయాంలోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందింది. తెలంగాణలోని గత ప్రభుత్వం అత్యంత అవినీతికి పాల్పడింది' అని వివరించారు. ఇందిరాగాంధీ పాకిస్థాన్‌ను రెండు ముక్కలు చేసింది.. మరీ మోదీ ఏం చేశారు? అమెరికా యుద్ధ నౌకలను పంపినా ఇందిరాగాంధీ భయపడకుండా ధైర్యంగా యుద్ధాన్ని కొనసాగించారు. పహల్గామ్ ఉగ్రదాడిని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను సమర్థించింది. పహల్గామ్ ఉగ్రదాడిపై కాంగ్రెస్ నేతలు అని దేశాలు తిరిగి ప్రచారం చేశారు. గాంధీ కుటుంబంలో దేశం కోసం ప్రాణాలను ఇచ్చిన వాళ్లు ఉన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లో అలాంటి వాళ్లు ఉన్నారా..? దేశం కోసం ప్రాణాలను ఇవ్వడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉంది. కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తాం.. దేశాన్ని కాపాడతాం. బీహార్ ఎన్నికల ప్రచారంపై ఉన్న శ్రద్ధ, మోదీకి దేశ భద్రతపై లేదు. 42 దేశాల్లో పర్యటించిన మోదీ.. మణిపూర్ కు ఎందుకు వెళ్లడం లేదు' అని ఆయన నిలదీశారు. సభకు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అధ్యక్షత వహించగా, ఏఐసీసీ ఆర్గనైజేషనల్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, రాష్ట్ర ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు పాల్గొన్నారు.



## మోదీ వస్తారో.. కేసీఆర్ వస్తారో రండి..

### రైతు రాజ్యం ఎవరిదో చర్చ పెడదాం

- ఢిల్లీలో ఉండే మోదీ అయినా.. గల్లీలోని కేడీ అయినా
- 60 వేల ఉద్యోగాలకు ఒక్కటి తగ్గినా క్షమాపణ చెప్తా
- బీఆర్ఎస్, బీజేపీ లీడర్లకు సీఎం రేవంత్ రెడ్డి ఓపెన్ ఛాలెంజ్
- వచ్చే ఎన్నికల్లో 15 ఎంపీ సీట్లు, 100 అసెంబ్లీ సీట్లు గెలుస్తాం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకునే బాధ్యత నాది
- సోషల్ మీడియాలో యుద్ధం చేస్తే కల్వకుంట్ల గడీ తునాతునకలవ్వాలె

(మొదటిపేజీ తరువాయి)

ఢిల్లీలో ఉండే మోదీ అయినా, గల్లీలోని కేడీ అయినా.. రైతు సంక్షేమం విషయంలో తేల్చుకునేందుకు రండి, సవాళ్లకు సిద్ధమని ప్రశ్నించారు. ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సామాజిక న్యాయ సమరభేరీ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు.

**ఖర్గేకు మాట ఇస్తున్నా**

'మా ప్రభుత్వం మూణ్ణాళ్ల ముచ్చటే అన్నారు. సంక్షేమ పథకాలు ఎక్కువ రోజులు అమలు చేయరని ప్రచారం చేశారు. కాంగ్రెస్ వాళ్లు కలిసి ఉండరని.. కొట్టుకుంటారని అన్నారు. తెలంగాణలో తిరుగులేదనుకుని విర్రవీగిన బీఆర్ఎస్‌ను దెబ్బకొట్టాం. మూడు రంగుల జెండా చేతబట్టి 4 కోట్ల మందిని చైతన్యపరిచాం. 15 నెలల్లోనే కులగణన చేసి సామాజిక న్యాయానికి శ్రీకారం చుట్టాం. దెబ్బ తిన్న వ్యవస్థలను పునరుద్ధరించుకుంటూ ముందుకు సాగుతున్నాం. కలిసికట్టుగా ముందుకెళ్తూ.. అందరి అపోహలు పటాపంచలు చేశాం' అని సీఎం వ్యాఖ్యానించారు. తొలి ఏడాది 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం.. కిషన్‌రెడ్డి, కేసీఆర్.. దమ్ముంటే ఉద్యోగ నియామకాలపై చర్చకు రావాలి.. 60 వేల ఉద్యోగాలకు ఒక్కటి తగ్గినా.. నేను క్షమాపణ చెబుతా. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరగబోతున్నాయి.. కొత్తగా ఎమ్మెల్యేలు వచ్చిన చోట బాధపడకండి.. మీకు టికెట్లు ఇచ్చి ఎమ్మెల్యేలుగా గెలిపించే బాధ్యత పార్టీ చూసుకుంటుంది.. మంత్రులుగా చేసే బాధ్యత ఖర్గే, రాహుల్ గాంధీ చూసుకుంటారు.. టికెట్ల కోసం ఢిల్లీకి వెళ్లాల్సిన అవసరం లేదు.. మీకు టికెట్లు ఇచ్చి దారిఖర్చులు కూడా ఇచ్చి పంపుతాం.. ఖర్గేకి మాట ఇస్తున్నా.. వచ్చే ఎన్నికల్లో 15 ఎంపీ సీట్లు, 100 అసెంబ్లీ సీట్లు గెలుస్తాం' అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

**పార్లమెంట్, అసెంబ్లీలో చర్చ పెడదాం..**

రైతు రాజ్యం ఎవరిదో పార్లమెంట్ లేదా అసెంబ్లీలో చర్చ పెడదాం. మోదీ వస్తారో? కేసీఆర్ వస్తారో రండి.. మేం చర్చకు సిద్ధం. రైతు భరోసా విఫలమవుతుందని గోతికాడ నక్కల్లా కొందరు ఎదురుచూశారు. కానీ 9 రోజుల్లో రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమచేశాం. కోటిమంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే మా లక్ష్యం. పేదలకు సొంత ఇళ్లు, సొంత భూమి ఉందంటే అది ఇందిరమ్మ ఇచ్చిందే' అని చెప్పారు. 'పథకాలకు ఇందిరమ్మ పేరు పెడితే కొందరు రాద్ధాంతం చేస్తున్నారు. అలాంటి వారిని గుడ్డలూడదీసి కొడితే కానీ బుద్ధి రాదు. అలాంటి వారికి బుద్ధి చెబితే కానీ ఇందిరమ్మ గొప్పదనం తెలియదు. సోషల్ మీడియాలో మన కార్యకర్తలు యుద్ధం ప్రకటించాలి. ఈ యుద్ధంలో కల్వకుంట్ల గడీ తునాతునకలు కావాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకునే బాధ్యత నాది' అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి ప్రసంగానికి ప్రజల నుండి పెద్ద ఎత్తున స్పందన కనిపించింది.

## సరిహద్దులో భారత్‌కు ముగ్గురు శత్రువులు

(మొదటిపేజీ తరువాయి)

ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ అలాగే జరిగిందని ఆయన గుర్తుచేశారు. ఓ వైపు భారత్, పాక్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ)లు చర్చలు జరుపుతుంటే, మరోవైపు భారత్ క్షిపణులు ప్రయోగిస్తున్న లొకేషన్ల సమాచారం చైనా నుంచి పాక్‌కు చేరిందన్నారు.

**చైనాకు లైవ్ ల్యాబ్‌లా మారిన పాక్**

చైనా తయారు చేస్తున్న కొత్తకొత్త ఆయుధాలు, నిఘా వ్యవస్థలకు లైవ్ ల్యాబ్‌లాగా పాక్ మారిందని రాహుల్ ఆర్.సింగ్ చెప్పారు. తమ ఆయుధాలను పాక్ గడ్డపై చైనా టెస్ట్ చేయిస్తోందని, ఇతర దేశాల ఆయుధాలతో పోల్చి చూసుకుంటోందని తెలిపారు. ఇటీవలే భారత్‌తో సైనిక ఘర్షణ వేళ తుర్కియే (టర్కీ) నుంచి కూడా పాక్‌కు కీలకమైన సైనిక సహాయం లభించిందని ఆయన పేర్కొన్నారు. యుద్ధాన్ని మొదలుపెట్టడం సులభమేనని, కానీ దాన్ని కంట్రోల్ చేయడం మాత్రం కష్టతరమైన అంశమని రాహుల్ ఆర్.సింగ్ వ్యాఖ్యానించారు. భారత్ పాక్ యుద్ధాన్ని ఆపేందుకు చాలాపెద్ద మాస్టర్ స్ట్రోక్‌లా డీజీఎంఓల స్థాయి చర్చలు పనిచేశాయన్నారు.

**'ఆపరేషన్ సిందూర్' నేర్పిన పాఠాలు**

ఆపరేషన్ సిందూర్ నుంచి కొన్ని పాఠాలను నేర్చుకోవాల్సిన అవసరం ఉందని డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ రాహుల్ ఆర్.సింగ్ అన్నారు. ఆపరేషన్ వేళ దేశ అత్యున్నత నాయకత్వం నుంచి స్పష్టమైన, వ్యూహాత్మక సందేశం అందరికీ అందిందని ఆయన చెప్పారు. కొన్నేళ్ల క్రితం వరకు ఉగ్రదాడులు జరిగితే భారత్ ఓర్చుకునేదని, ఇప్పుడు ఎప్పటికప్పుడు బలమైన సమాధానాన్ని ఇస్తోందన్నారు. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీరు (పీఓకే)లలోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ అత్యంత కచ్చితత్వంతో దాడి చేసిందని తెలిపారు. ఈ ఆపరేషన్ కోసం మొత్తం 21 శత్రు టార్గెట్లను ఎంపిక చేయగా, వాటిలో 9 టార్గెట్లను అప్పటికప్పుడు ఫైనలైజ్ చేసి దాడులు మొదలుపెట్టామన్నారు. శత్రు టార్గెట్ల ఎంపిక, దాడి ఒకేరోజు జరిగాయని రాహుల్ ఆర్.సింగ్ చెప్పారు. భారత్‌లో మరింత విస్తారంగా గగనతల రక్షణ వ్యవస్థలను మోహరించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. ఈసారి ఆపరేషన్ సిందూర్ వేళ భారీ జనాభా ఉండే ప్రాంతాల్లో గగనతల రక్షణ వ్యవస్థలను అంతగా మోహరించలేకపోయామని, మరోసారి ఇలాంటి అంశంలో మనం సన్నద్ధంగా ఉండాలన్నారు.



## కాంగ్రెస్ దోపిడీకి తెలంగాణ అక్షయపాత్ర

- సామాజిక న్యాయానికి తూట్లు పొడిచేందుకే సభ
- ఖర్గే సభపై టీ-బీజేపీ చీఫ్ రామచందర్‌రావు విమర్శలు

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్‌పై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రర్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. సామాజిక న్యాయానికి తూట్లు పొడిచేందుకే కాంగ్రెస్ సభ నిర్వహిస్తోందని ఆయన 'ఎక్స్' వేదికగా విమర్శించారు. కాంగ్రెస్ దోపిడీకి తెలంగాణ అక్షయ పాత్రగా మారిందని వ్యాఖ్యానించారు. గ్యారెంటీలు, హామీల పేరుతో హడావుడి తప్ప అమలులో మాత్రం శూన్యమని విమర్శించారు. బీసీలకు తీవ్ర అన్యాయం చేసి.. ఎస్సీ, ఎస్టీలకు సంకెళ్లు వేసి భీమ్ పేరుతో నాటకమాడుతోందన్నారు. ఎమర్జెన్సీతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాలకు తూట్లు పొడిచి.. న్యాయాన్ని, రాజ్యాంగ విలువలను కాంగ్రెస్ ఖూనీ చేసిందని ధ్వజమెత్తారు.

## ఇక పదవుల జాతర

- సీఎంకు జాబితా ఇవ్వాలని ఇంచార్జి మంత్రులకు ఖర్గే ఆదేశం
- మార్కెట్ కమిటీలు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఆలయ పాలకమండళ్ల పోస్టుల భర్తీ
- గ్రంథాలయ, వక్ఫ్, ఆత్మ కమిటీలు, అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీలు కూడా
- వెంటనే సీఎంకు జాబితా ఇవ్వాలని ఇన్ చార్జి మంత్రులకు ఏఐసీసీ చీఫ్ ఖర్గే ఆదేశం

**హైదరాబాద్, మహా :** నామినేటెడ్ పదవుల జాతరకు ఏఐసీసీ చీఫ్ ఖర్గే పచ్చజెండా ఊపారు. హైదరాబాద్ లో శుక్రవారం జరిగిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే జిల్లా స్థాయి నామినేటెడ్ పోస్టులను వెంటనే భర్తీ చేయనున్నట్టు ప్రకటించారు. సీఎం మాట్లాడుతూ.. కొద్ది నెలల పీసీసీ చీఫ్, మంత్రులకు ఈ టాస్క్ అప్పగించానని, జిల్లాల నేతల పేర్లు ఇవ్వడం లేదని అన్నారు. దీనిపై ఏఐసీసీ చీఫ్ ఖర్గే స్పందిస్తూ ఇన్ చార్జి మంత్రులు జాబితాను సిద్ధం చేసి సీఎంకు ఇవ్వాలని సూచించారు. స్థానిక ఎన్నికల కన్నా ముందుగా మార్కెట్ కమిటీల పాలక మండళ్లు, ఆలయ కమిటీలు, జిల్లా గ్రంథాలయ సంస్థల పాలక మండళ్లు, అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీలు, ఆత్మ కమిటీల నియామకం జరగనుంది. ఖాళీ ఉన్న స్థానాల్లో కొత్త వారిని నియమించనున్నారు. ఈ క్రమంలో పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్య ఇవ్వనున్నారు. వీటి భర్తీ ప్రక్రియ ఇన్ చార్జి మంత్రులకు అప్పగించారు. ఉమ్మడి జిల్లాలకు బాధ్యులుగా ఉన్న ఇన్ చార్జి మంత్రులు జాబితాను సిద్ధం చేసి ఇవ్వాల్సి ఉంటుంది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నామినేటెడ్ పదవులు పొందిన వాళ్లు స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సత్తా ఉన్న వారికే పదవులు దక్కే అవకాశం ఉంది. ఆగస్టు 30 కల్లా గ్రామకమిటీలు పూర్తిచేయాలని ఆదేశించారు.

**గ్రూపు రాజకీయాలపై ఖర్గే ఫైర్**

కాంగ్రెస్ లో గ్రూపు రాజకీయాలు చేయవద్దని, పార్టీలో కొందరు చేస్తున్నటువంటి వాటికి అస్సలు భయపడేది లేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యనించారు. కాంగ్రెస్ లోని నేతల మధ్య విభేదాలుంటే పార్టీలోనే చర్చించుకోవాలి.. కానీ బయట ఎవ్వరూ మాట్లాడవద్దని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీలకు ఎలాంటి అవకాశం ఇవ్వవద్దని ఆయన సూచించారు. ఏదేని సమస్యలుంటే రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, నేతలతో కో ఆర్డినేట్ చేసుకోవాలన్నారు. గాంధీ భవన్ లో తెలంగాణ కాంగ్రెస్ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ (పీఏసీ), సలహా కమిటీ సమావేశం జరిగింది. దాదాపు రెండు గంటలపాటు సాగిన ఈ సమావేశానికి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా విచ్చేయగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీఏసీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీలో కొత్తగా చేరిన వారిని పాతవారు కలుపుకోని, వారిని సమన్వయం చేసుకోవాని ముందుకెళ్లాలని సూచించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా కీలకంగా ముందుకు సాగాలన్నారు.



## సీఎం అభ్యర్థిగా విజయ్

**తమిళనాడు, మహా:** వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ తమిళగ వెట్రి కళగం పార్టీ కీలక ప్రకటన చేసింది. ఈ ఎన్నికల్లో తమ పార్టీ సీఎం అభ్యర్థిగా టీవీకే వ్యవస్థాపకుడు, సినీ నటుడు విజయ్‌ను ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం చెన్నైలో జరిగిన పార్టీ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో తీర్మానం చేశారు. వచ్చే నెలలో భారీ ఎత్తున రాష్ట్ర మహాసభలు నిర్వహించాలని పార్టీ ప్రతిపాదించింది. తమ పార్టీ సిద్ధాంతాన్ని విస్తృతంగా ప్రచారం చేసేందుకు గ్రామాల్లో బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. తమిళనాడు ఎన్నికల్లో వేర్పాటు వాదులతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. బీజేపీ విభజన రాజకీయాలు చేస్తోందని మండిపడిన ఆయన.. బీజేపీ విషపూరిత రాజకీయాలు తమిళనాడులో చెల్లవన్నారు. బీజేపీతో చేతులు కలపడానికి తమ పార్టీ ఏమీ డీఎంకే, అన్నాడీఎంకే కాదన్నారు. బీజేపీ, డీఎంకేలతో తమకు పొత్తులు ఉండబోవని తేల్చి చెప్పిన విజయ్.. ఆ రెండు పార్టీలను తమకు సైద్ధాంతిక శత్రువులుగా పేర్కొన్నారు.

## త్వరలో మరో ఉద్యోగ నోటిఫికేషన్

**హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో 2 వేల జాబ్స్‌కు లైన్ క్లియర్**

**ఖాళీ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి మంజూరు**

**ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవల విస్తరణకు ప్రణాళిక**

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో వైద్య ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వైద్య విధాన పరిషత్ పరిధిలో ఖాళీగా ఉన్న పలు పోస్టులను భర్తీ చేసేందుకు ఆర్థిక శాఖ అనుమతి మంజూరు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ సేవలు మెరుగుపరచడం, ప్రభుత్వం నడిపే ఆస్పత్రుల్లో సిబ్బంది కొరతను తీర్చడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ ఆమోదంతో వైద్య విధాన పరిషత్‌లో మొత్తం 2,363 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో 944 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో, 87 పోస్టులను మినిమం టైమ్ స్కేల్ విధానంలో, మరో 1,332 పోస్టులను ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**త్వరలోనే నోటిఫికేషన్..**

త్వరలోనే ఈ నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశముంది.



ఈ నియామకాల ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యత పెరగనుండగా, పల్లెప్రాంతాల్లోనూ వైద్యం అందుబాటులోకి రావడానికి ఇది దోహదపడనుంది. రాష్ట్రంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మెరుగైన వైద్య సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ నియామకాలు ఆ దిశగా వేయబోయే అడుగులని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల అవసరాలకు తగినట్టు తగినంత మంది డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టడం ప్రభుత్వ విధానానికి అద్దం పడుతోంది.

## గ్రీన్ ట్రాన్స్‌ఫర్మేషన్ దిశగా అడుగులు

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం హైదరాబాద్‌లో అట్టహాసంగా వరల్డ్ మైనింగ్ కాంగ్రెస్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సదస్సులో జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న సుస్థిర మైనింగ్ పద్ధతులను తెలుసుకోవడంలో వరల్డ్ మైనింగ్ కాంగ్రెస్ సదస్సు చాలా కీలకమని కిషన్‌రెడ్డి వెల్లడించారు. మైనింగ్ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం చాలా అవసరమని వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా కీలక నిర్ణయాలు తీసుకుందని ఉద్ఘాటించారు.

**ఇన్సెంటివ్స్ ఇస్తున్నాం..**

బొగ్గు, గనుల రంగం ఆత్మ నిర్భరత సాధించాలంటే ప్రపంచస్థాయి ఆలోచనల అమలు అవసరమని చెప్పుకొచ్చారు. ప్రకృతిని, ప్రజలను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లేనే సుస్థిర మైనింగ్ సాధ్యమని తెలిపారు. బొగ్గు, ఇతర మినరల్స్ ఉత్పత్తి, ప్రజాసంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, సాంకేతికతకు ప్రోత్సాహం అందించడం మోదీ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని ఉద్ఘాటించారు. ఉత్పత్తి చేయడం ఎంత ముఖ్యమో.. బాధ్యతాయుతంగా మైన్ క్లోజర్‌పై దృష్టిపెట్టడం కూడా చాలా కీలకమని చెప్పుకొచ్చారు. ఇందుకోసం సింగిల్ విండో సిస్టం తీసుకొచ్చామని అన్నారు. ఇందుకోసం త్వరగా అనుమతులను మంజూరు చేస్తున్నామని చెప్పారు. గనుల కోసం భూములు ఇస్తున్న వారికి అవసరమైన ఉపాధి అవకాశాలు కల్పించడం, వారి జీవన ప్రమాణాలను పెంచేందుకు మోదీ సర్కార్ కృషిచేస్తోందని చెప్పుకొచ్చారు. ఇన్సెంటివ్స్ ఇస్తున్నాం, పరిశోధనలకు, అధునాతన సాంకేతికతను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ ట్రస్ట్ ద్వారా ఎక్స్‌ప్లొరేషన్‌ను మరింతగా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రైవేట్ సంస్థలను కూడా ఎక్స్‌ప్లొరేషన్ చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.



# బీజేపీకి మహిళా అధ్యక్షురాలు?

## రేసులో నిర్మలా సీతారామన్, పురందేశ్వరి, వానతి



**మహా:** బీజేపీ అధ్యక్ష పీఠాన్ని ఈసారి ఒక మహిళకు అప్పగించాలని పార్టీ హైకమాండ్ డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనకు ఆర్ ఎస్ ఎస్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. పైగా ఈ రేసులో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందరేశ్వరి, బీజేపీ జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వానతీ శ్రీనివాసన్ ఉన్నట్లు తెలుస్తోంది. స్మృతి ఇరానీ, డికె అరుణ, తమిళి సై పేర్లు కూడా చర్చకు వచ్చే అవకాశముంది.

**మహిళలకు పెద్దపీట**

భారతీయ జనతా పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించాలంటే, కనీసం 19 రాష్ట్రాల్లో నూతన సారథుల నియామకాలు పూర్తి కావాలి. ఇప్పటి వరకు 16 రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షులను ఖరారు చేశారు. మరికొన్ని రోజుల్లో మధ్యప్రదేశ్ లాంటి పెద్ద రాష్ట్రాలకు కొత్త సారథులను నియమించనున్నారు. ఆ తర్వాత పార్టీ నిబంధనల ప్రకారం, పార్టీ జాతీయ అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహిస్తారు. అయితే ఈ సారి బీజేపీ జాతీయ అధ్యక్ష పదవిని ఒక మహిళకు అప్పగించే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. ఈ రేసులో ప్రధానంగా నిర్మలా సీతారామన్, పురందరేశ్వరి, వానతీ శ్రీనివాసన్ పేర్లు వినిపిస్తున్నాయి. తమ పార్టీలో స్త్రీలకు పెద్దపీట వేయాలనే ఉద్దేశంతోనే మొదటిసారిగా ఓ మహిళకు అధ్యక్ష పదవి కట్టబెట్టేందుకు అధిష్ఠానం చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

**నిర్మలా సీతారామన్**

బీజేపీ అధ్యక్ష పదవి రేసులో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మొదటి స్థానంలో ఉన్నట్లు తెలుస్తోంది. భారతీయ జనతా పార్టీలోని అత్యంత ప్రభావవంతమైన నేతల్లో ఆమె ఒకరు. 2019లో మోదీ ప్రభుత్వ హయాంలో తొలిసారి నిర్మలమ్మ ఆర్థికశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి, ఇప్పటికీ అదే పదవిలో కొనసాగుతున్నారు. ఇటీవల ఆమె బీజేపీ ప్రధాన కార్యాలయంలో ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డా, పార్టీ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌లను కలిసినట్లు తెలుస్తోంది.

**దగ్గుబాటి పురందేశ్వరి**

రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కూడా బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి రేసులో ఉన్నారు. ఆమె బీజేపీ ఆంధ్రప్రదేశ్ యూనిట్ చీఫ్‌గా పని చేశారు. ఉగ్రవాదంతో అంటకాగుతూ భారత్‌పై విషం చిమ్ముతున్న పాక్ కుయుక్తుల్ని అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు కేంద్రం ఏర్పాటుచేసిన 7 అఖిలపక్ష బృందాల్లోని ఓ బృందానికి పురందేశ్వరి ప్రాతినిధ్యం వహించారు కూడా. ఫ్రాన్స్, యూకే, ఈయూ, ఇటలీ, డెన్మార్క్, జర్మనీ దేశాల్లో పర్యటించిన ఆమె బృందం ఉగ్రవాదంపై భారత్ వైఖరిని ప్రపంచ దేశాలకు స్పష్టంచేసింది.

**వానతీ శ్రీనివాసన్**

బీజేపీ జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు, తమిళనాడు ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ 1993 నుంచి భారతీయ జనతా పార్టీలో కొనసాగుతున్నారు. ఆమె 2021 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) వ్యవస్థాపకుడు అయిన కమల్ హాసన్‌ను ఓడించి కోయంబత్తూర్ (దక్షిణ) స్థానాన్ని గెలుచుకున్నారు. 2022లో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యురాలిగా ఆమె ఎన్నికయ్యారు.



# ఉక్రెయిన్ రాజధాని అల్లకల్లోలం


## కీవ్ నగరం టార్గెట్‌గా రష్యా దాడులు

- 539 డ్రోన్లు, 11 క్షిపణులతో పెద్ద ఎత్తున ధ్వంసం
- తీవ్రంగా దెబ్బతిన్న కీవ్‌లోని పోలెండ్ దౌత్యకార్యాలయం

**ఇంటర్నెట్ డెస్క్, మహా:** డ్రోన్లు, క్షిపణులతో జూలై నాలుగో తేదీ రాత్రంతా రష్యా జరిపిన దాడులతో కీవ్ నగరం అల్లకల్లోలమైంది. ఈ దాడుల్లో 23 మంది గాయపడినట్టు తెలుస్తున్నది. నగర వ్యాప్తంగా రైల్వే మౌలిక సదుపాయాలు పెద్ద ఎత్తున ధ్వంసమయ్యాయి. అనేక భవంతులు, వాహనాలు తగలబడిపోయాయని శుక్రవారం (జూలై 4 2025) ఉక్రెయిన్ ప్రకటించింది. రష్యా మొత్తం 539 డ్రోన్లు, 11 మిస్సైళ్లను ప్రయోగించడంతో కీవ్ నగరంలో దాదాపు ఎనిమిది గంటలపాటు వైమానిక దాడులపై అప్రమత్తం చేసే సైరన్లు మోగుతూనే ఉన్నాయి. ఇటీవలి కాలంలో కీవ్ నగరంపై దాడుల తీవ్రతను పెంచిన క్రమంలో తాజా దాడులు చోటు చేసుకున్నాయి. దాదాపు 30 లక్షల మంది ప్రజలు కీవ్ నగరంలో నివసిస్తున్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇదే అతిపెద్ద దాడిగా చెబుతున్నారు. రష్యా దాడుల్లో దేశంలోనే రైల్వే నెట్‌వర్క్ దెబ్బతినడంతో పెద్ద సంఖ్యలో ప్యాసింజర్ రైళ్లను దారిమళ్లించినట్టు, రైలు ప్రయాణాల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటున్నట్టు ప్రభుత్వ రంగంలోని అతిపెద్ద రైల్వే ఉక్రజాలిజ్నిట్సియా తెలిపింది.

**కీవ్ నగరం ప్రధాన టార్గెట్..**

ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరం ప్రధాన టార్గెట్‌గా ఈ దాడులు చోటుచేసుకున్నట్టు ఉక్రెయిన్ ఎయిర్‌ఫోర్స్ తెలిపింది. గాయపడినవారిలో 14 మందికి హాస్పిటళ్లలో చికిత్స అందిస్తున్నట్టు కీవ్ మేయర్ విటాలి విటాలి క్లిట్స్కో తెలిపారు. కీవ్‌లోని పది జిల్లాలకుగాను దినిప్రో నదికి అటూ ఇటూ ఉన్న ఆరు జిల్లాల్లో విధ్వంసం రికార్డైందని పేర్కొన్నారు. డ్రోన్ శిథిలాలు పడటంతో హోలోసివిస్కీ లో ఒక హాస్పిటల్ మంటల్లో చిక్కుకున్నదని తెలిపారు. శిథిలాలు, మంటల కారణంగా వాతావరణం ప్రమాదకరంగా మారినందున నగర పౌరులు తమ ఇళ్ల కిటికీలు మూసి ఉంచాలని కీవ్ సిటీ మిలిటరీ అడ్మినిస్ట్రేటర్ తైమూర్ టకాచెంకో విజ్ఞప్తి చేశారు. రష్యాను ఉగ్రవాద దేశంగా అభివర్ణించిన ఆయన.. ఉక్రెయిన్‌లో విధ్వంసం సృష్టించిందని ఆరోపించారు. రష్యన్లు చేసిన పని ఉగ్రవాదం, హత్యకు ఏ మాత్రం తీసిపోదని వ్యాఖ్యానించారు.



# తెలుగు రాష్ట్రాల హైకోర్టులకు కొత్త న్యాయమూర్తులు

- సుప్రీంకోర్టు కొలీజయం కీలక సిఫార్సులు
- ఏపీ హైకోర్టుకు తుహిన్ కుమార్ పేరు ప్రతిపాదన
- తెలంగాణ హైకోర్టుకు నలుగురు కొత్త జడ్జీల పేర్లు ఖరారు
- జూన్ 2న సమావేశంలో కొలీజయం నిర్ణయం

**న్యూఢిల్లీ, మహా :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టులలో కొత్త న్యాయమూర్తుల నియామకానికి మార్గం సుగమమైంది. ఇరు రాష్ట్రాల హైకోర్టులకు కలిపి మొత్తం ఐదుగురు కొత్త జడ్జీల పేర్లను సుప్రీంకోర్టు కొలీజయం సిఫారసు చేసింది. ఈ మేరకు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజయం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ హైకోర్టుకు నలుగురు కొత్త న్యాయమూర్తుల పేర్లను కొలీజయం ప్రతిపాదించింది. వీరిలో సుద్దాల చలపతిరావు, గాడి ప్రవీణ్ కుమార్, వాకిటి రామకృష్ణారెడ్డి, గౌస్ మీరా మొహిద్దీన్ ఉన్నారు. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా తుహిన్ కుమార్ పేరును సిఫారసు చేయడం జరిగింది. జూన్ 2వ తేదీన జరిగిన సమావేశంలో సుప్రీంకోర్టు కొలీజయం ఈ ఐదుగురి పేర్లను ఖరారు చేసి, వారి నియామకం కోసం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.



# పోలీసుల వాహన తనిఖీల్లో 72 వాహనాలు సీజ్

## డి ఎస్ పి సూర్యనారాయణ

**కాటారం, మహా :** భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం కాటారం డిఎస్పి ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గంటగూడెం లో రెండు గంటలపాటు నిర్వహించిన వాహన తనిఖీల్లో 72 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇచ్చి నడిపించరాదని, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వడం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని కేసులలో ఇరుక్కోవాల్సి వస్తుందని 18 సంవత్సరాలు దాటిన యువతి యువకులు లైసెన్స్ తీసుకొని వాహనాలు నడిపించాలని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ద్విచక్ర వాహనాలపై వెళ్లే వాహనదారులు హెల్మెట్ ధరించాలని డిఎస్పి సూర్యనారాయణ అన్నారు. తల్లిదండ్రులు తమ సెల్ ఫోన్ లను పిల్లలకు ఇవ్వద్దని వాటిని చూడడం ద్వారా ఇతర వ్యసనాలకు లోనవుతున్నారని, పసిపాపలు ఆడుకోవడానికి లేదా ఏడవకుండా ఉండడానికి సెల్ ఫోన్లను ఇవ్వడం ద్వారా కాంతి కిరణాలతో పిల్లల కళ్ళు దెబ్బతింటాయని డిఎస్పి వివరించారు ట్రాఫిక్ నిబంధనలు ఇతర అంశాలను కార్డెన్ సెర్చ్‌లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఐ నాగార్జున రావు, ఎస్సైలు మహేందర్ కుమార్, అభినవ్, సిఆర్పిఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

# రోశయ్య జయంతి సభలో చాగంటి అసహనం

## ఇది మర్యాద కాదు అంటూ ఆగ్రహం

ప్రసంగిస్తుండగా ఫోటోల కోసం ఎగబడ్డ జనం

ప్రసంగం ఆపి తీవ్ర అసహనం వ్యక్తం చేసిన చాగంటి

రోశయ్యతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న చాగంటి



**హైదరాబాద్, మహా :** ప్రముఖ ప్రవచనకర్త, పండితులు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఓ సభలో తీవ్ర అసహనానికి గురయ్యారు. వేదికపై ప్రసంగిస్తున్న సమయంలో కొందరు ఫోటోలు తీయడానికి గుంపుగా చేరడంతో ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన ఈ సభలో చాగంటిని సత్కరించారు. అనంతరం ఆయన ప్రసంగించడానికి సిద్ధమవుతుండగా, పలువురు అభిమానులు, నాయకులు వేదికపై ఆయన వెనుక చేరి ఫోటోలు తీయడం ప్రారంభించారు. దీంతో ప్రసంగాన్ని మధ్యలోనే ఆపిన చాగంటి, వారి ప్రవర్తనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఒక మహానుభావుడి గురించి నివాళి అర్పిస్తూ మాట్లాడేటప్పుడు కనీస మర్యాద పాటించడం ధర్మం. ఇలా వెనకాల నిలబడి ఫోటోలు తీయడం మర్యాద కాదు. మీరందరూ కిందకు వెళ్ళి కూర్చోండి" అని ఆయన కాస్త ఘాటుగానే వ్యాఖ్యానించారు. "మాట్లాడటానికి నాకేమీ భయం లేదు, మీరెవరూ నా వెనుక నిలబడాల్సిన పనిలేదు. సభకు ఒక గౌరవం ఉండాలి" అంటూ క్రమశిక్షణ పాటించకపోవడంపై చురకలు అంటించారు. అనంతరం తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, రోశయ్య గారితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తాను చెన్నైలో ప్రవచనాలు ఇస్తున్నప్పుడు, అప్పటి తమిళనాడు గవర్నర్‌గా ఉన్న రోశయ్య గారు స్వయంగా ఫోన్ చేసి రాజభవన్‌కు ఆహ్వానించారని, తన పట్ల ఎంతో గౌరవం చూపించారని వివరించారు.

# నల్లగండ్ల నాలా పనులకు తొలగిన ఆటంకాలు

## ఆక్రమణలను తొలగించిన హైడ్రా



**హైదరాబాద్, మహా :** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నల్లగండ్ల ప్రాంతంలో వరద నీరు సాఫీగా సాగేందుకు ఉన్న ఆటంకాలను హైడ్రా తొలగించింది. నల్లగండ్ల చెరువు నుంచి వచ్చే వరద నీటి కాలువ పనులు ఇక జోరందుకోనున్నాయి. స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద 2 కిలోమీటర్ల మేర ఈ వరద నీటి కాలువను నిర్మిస్తున్న విషయం విధితమే. ఈ నాలా చాలా చోట్ల ఆక్రమణలకు గురయ్యింది. కొన్ని చోట్ల ఇంటి యజమానులు ముందుకొచ్చి ఆక్రమణలను తొలగించగా.. మరి కొంతమంది అభ్యంతరాలు తెలిపారు. దీంతో నాలా పనులు ముందుకు సాగడం కష్టంగా మారింది. ఈ తరుణంలో ఎస్ ఎన్‌డీపీ ప్రాజెక్టు నిర్వాహకులు హైడ్రాను ఆశ్రయించారు. ఇదే సమయంలో నీటి ముంపు ముప్పు ఉన్న ప్రాంతాల నుంచి కూడా స్థానికులు హైడ్రాకు వచ్చి ఫిర్యాదు చేశారు.

**ఆటంకాలాను తొలగించిన హైడ్రా**

2 కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉన్న నాలా కేవలం.. 230 మీటర్ల మేర పూర్తయ్యింది. నల్లగండ్ల హుడా కాలనీలో సమస్య తలెత్తింది. ఒక అపార్టుమెంట్ ప్రహరీతో పాటు కొంత నిర్మాణం నాలాపైనే ఉంది. ఇదే మాదిరి మరి కొన్ని చోట్ల కూడా సమస్య తలెత్తడంతో ఎస్ ఎన్‌డీపీ అధికారులు హైడ్రాను ఆశ్రయించారు. శుక్రవారం హైడ్రా రంగంలోకి దిగింది. నాలా పరిధిలో ఉన్న నిర్మాణాన్ని హైడ్రా తొలగించింది. నాలాకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి పనులు జరిగేందుకు అవకాశం కల్పించింది. నల్లగండ్ల చెరువు నుంచి మొదలై..డాక్టర్స్ కాలనీ, రైల్ విహార్, నల్లగండ్ల హుడా కాలనీ, ఓల్డ్ శేరిలింగంపల్లి విలేజ్, నేతాజీనగర్ మీదుగా.. బీహెచ్ఈఎల్ చౌరస్తా వద్ద ఉన్న ప్రధాన నాలాలో ఈ నాలా కలుస్తుంది. నాలా ఆక్రమణలకు గురవ్వడంతో ప్రతి ఏటా వర్షాకాలంలో నీట మునిగే ముప్పు ఈ కాలనీలకు తప్పుతోందని స్థానికులు సంతోషం వ్యక్తంచేశారు. ఆటంకాలు తొలగాయి కనుక.. ఎస్ ఎన్ డీపీ నిర్వాహకులు ఈ పనులు వెంటనే పూర్తి చేయాలని స్థానికులు కోరారు.

# ప్రమాదాలకు నిలయంగా నేషనల్ హైవే 65

## కొనసాగుతున్న విస్తరణ పనులు

- ఇరుకుగా మారిన రహదారి
- రాత్రి వేళల్లో ప్రయాణం.. అరచేతిలో ప్రాణం
- కనిపించని ప్రమాద సూచికలు
- రహదారి పక్కనే వాహనాల పార్కింగ్



**హైదరాబాద్, మహా :** అతి వేగం.. ఇరుకు రోడ్డు.. ఎక్కడపడితే అక్కడ వాహనాల పార్కింగ్. వెరసి హైవే 65 పై ప్రయాణం నరకప్రాయంగా మారింది. రాత్రి పూట వాహనాలు నడపడం ప్రాణాలతో చెలగాటమే అవుతున్నది. హైదరాబాద్ నగర సరిహద్దులోని లింగంపల్లి నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తా (సంగారెడ్డి) వరకు హైవేను ఆరు వరుసలుగా విస్తరిస్తున్నారు. ఒకవైపు రోడ్డు పనులు జరుగు తుండటంతో మరోవైపు నుంచి మాత్రమే వాహనాలను అనుమతిస్తున్నారు. దీంతో వాహనాలు ఒకదానికొకటి రాసుకుంటూ వేళ్లే పరిస్థితి నెలకొన్నది. ఫ్లై ఓవర్లు నిర్మిస్తున్న ప్రదేశంలో మరింత ఇబ్బందికరంగా మారింది. ఒకవైపు డివైడర్. మరోవైపు రోడ్డు పక్కన పెద్ద గుంతలు ఉండ టంతో ఎటూ తప్పించలేని పరిస్థితి.

**వాహనాల రద్దీ**

హైదరాబాద్‌ముంబాయి నగరాల మధ్య 65వ నంబరు హైవేనే ప్రధాన రహదారిమార్గం కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. హైదరాబాద్ నుంచి ముంబాయి. షిర్డీతో పాటు పలు నగరాల మధ్య ప్రైవేటు ట్రావెల్స్ ఎక్కువగా తిరుగుతుంటాయి. ఇక కర్ణాటక నుంచి కూడా నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు హైదరాబాద్ కు రాకపోకలు సాగిస్తుంటాయి. సాయం త్రం అయిందంటే రద్దీ మరింత పెరిగి గంటల తర బడి ట్రాఫిక్ నిలిచిపోతున్నాయి. విస్తరణ పనులు కొనసాగుతుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. బండెనక బండి.. అన్నట్లు వాహనం వెనుకాలే మరో వాహనం వరుస కట్టడంతో కిలోమీటరు దూరానికి అరగంట పడుతోంది. ఇది చాలదన్నట్లు జాతీయ రహదారి పక్కన పెట్రోల్ బంకులు, హోటళ్ల వద్ద భారీ వాహనాలను ఇష్టారీతిన పార్కింగ్ చేస్తున్నారు. అసలే ఇరుకుగా మారిన రోడ్డుపై వాహనాలు నిలుపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గంటల తరబడి భారీ వాహనాలు రోడ్డు పక్కన పార్కింగ్ చేస్తున్నా పోలీసులు మాత్రం పట్టించుకోవడం లేదు.

**బ్లాక్ స్పాట్ల వద్ద సూచికలేవీ?**

సంగారెడ్డి జిల్లాలో 65వ నంబరు జాతీయ రహదారిపై పోలీసులు కొన్ని బ్లాక్ స్పాట్లను గుర్తించారు. పటాన్ చెరువు ఆర్టీసీ బస్టాండ్, ముత్తంగి, ముత్తంగి గ్రామం, ఇస్నాపూర్ చౌరస్తా, లక్షారం గేట్, నోవాపాన్ చౌరస్తా, రుద్రారం గ్రామాలను ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు. సంగారెడ్డి రూరల్ పోలీస్టేషన్ పరిధిలోని కవలంపేట, కంది, జిమ్ దాబా, పోతిరెడ్డిపల్లి చౌరస్తా, కొండాపూర్ పోలీస్టేషన్ పరిధిలోని మల్కాపూర్ చౌరస్తా, సదాశివపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సదాశివపేట బస్టాండ్, నందికంది, ఎంఆర్ఎఫ్ కాలనీ, కోహీర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దిగ్వాల్, సంగారెడ్డి మండలం ఫసల్వాది గ్రామాలను కూడా బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు. ఆయా ప్రదేశాల్లో ఇదివరకు ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను రోడ్డు విస్తరణ కారణంగా తొలగిం చారు. నెలల తరబడి పనులు కొనసాగుతున్నా ప్రమాద సూచికలుగానీ, బోర్డులుగానీ ఏర్పాటు చేయలేదు. దీంతో, వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారినపడుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో 2024 సంవత్సరంలో మొత్తం 852 ప్రమాదాలు జరిగాయి. 384 మంది మృత్యువాతపడగా 913 మంది క్షతగాత్రులయ్యారు. 2025లో ఇప్పటి వరకు 401 ప్రమాదాల్లో 196 మంది మృతిచెందారు. 486 మంది గాయపడ్డారు. ఇందులో అత్యధికంగా హైవే 65పై జరిగినవే కావడం గమనార్హం.


# డాక్టర్ విజయ్ బాబుకు ఎన్టీఆర్ సాహితీ అవార్డు

## అవార్డును ప్రదానం చేసిన ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్ట్ చైర్మన్ లక్ష్మీపార్వతి



**హైదరాబాద్, మహా :** సుప్రసిద్ధ పాత్రికేయుడు, ఆర్టీఐ మాజీ కమిషనర్, ఆంధ్ర ప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు డాక్టర్ విజయబాబుకు 2025 సంవత్సరం ఎన్టీఆర్ సాహితీ అవార్డుని ప్రధానం చేశారు. రవీంద్ర భారతిలో ఎన్టీఆర్ విజ్ఞాన ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి ఈ అవార్డుని ప్రదానం చేశారు. ఈ అవార్డుతో పాటు ఆధ్యాత్మిక రంగం నుంచి డాక్టర్ పి లలితా వాణి కి ఎన్టీఆర్పు రస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ, మూడు దశాబ్దాలుగా జాతీయస్థాయిలోని సుప్రసిద్ధ సాహితీ మూర్తుల్ని జ్ఞానపీట్ అవార్డు గ్రహీతలతో సహా అనేక మందిని ఏటా ఎన్టీఆర్ సాహితి అవార్డుతో సత్కరించుకున్నామని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఈ అవార్డుని తాను కొనసాగిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమానికి ఇటు జర్నలిజం అటు సాహిత్య రంగంలో లబ్ధ ప్రతిష్టులైన కొమ్మినేని శ్రీనివాసరావు, ఓలేటి పార్వతీశం, డాక్టర్ గౌరీ శంకర్, నల్లమోతు రాణి వంటి వారు హాజరు కావడం ఎంతో సమిచితంగా ఉందని లక్ష్మీపార్వతి అన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, బహుముఖ ప్రజ్ఞాశాలి విజయబాబుకి ఈ అవార్డు ఇవ్వడం ఎంతో సమచితంగా ఉందని, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులుగా ఆయన నిర్వహించిన కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు. జర్నలిస్టుగా ఎన్టి రామారావు గారితో తనకున్న అనుభవాల్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. మరొక ముఖ్య అతిథి డాక్టర్ ఓలేటి పార్వతీశం ఇటు సాహిత్య రంగంలో అటు న్యాయవాద రంగంలో కూడా విజయబాబు అందిస్తున్న సేవలు ప్రస్తావిస్తూ అభినందనలు తెలియజేశారు. మరొక ఆత్మీయ అతిథి, పూర్వ రిజిస్టర్ డాక్టర్ గౌరీ శంకర్ ప్రసంగిస్తూ, తెలుగుజాతికి తెలుగు భాషకు తెలుగు సంస్కృతికి ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా చేసిన కృషి మరపురానిదన్నారు. అయితే ఆయన ప్రవేశపెట్టిన సంప్రదాయాలు తదనంతర కాలంలో అదృశ్యం కావడం బాధాకరమని ఆవేదన వెలిబుచ్చారు. డాక్టర్ విజయబాబుకు తెలుగు సంస్కృత భాషల పట్ల ఉన్న పట్టుని ఆయన అభినందించారు. సీతా చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ రాణి నల్లమోతు ప్రసంగిస్తూ, లక్ష్మీపార్వతి గారి సాహితీ కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని, ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొని తనకు ఎంతో ఆనంద దాయకమని అన్నారు. అవార్డు గ్రహీత డాక్టర్ విజయబాబు తన స్పందన తెలియజేస్తూ, తెలుగు సినీ రమ్య హర్మ్యానికి ఎన్టీఆర్ మణిమయ రంజిత గోపురంగా భాసిల్లారని, రాజకీయాల్లోనూ సాహితీ సంస్కృతులకు ముఖ్యమంత్రిగా ఆయన పెద్దపీట వేశారని, ఆయా కార్యక్రమాల్లో ఆయనకు బాసటగా నిలిచిన డాక్టర్ లక్ష్మీపార్వతి గారి క్రియాశీలక పాత్ర మరువలేమన్నారు. కాళిదాసు సాహిత్యం లోతుగా అధ్యయనం చేసిన నందమూరి లక్ష్మీపార్వతి వంటి సాహితీ విద్వన్మణి రాజకీయాల్లో కుహనా రాజకీయ శక్తుల నుంచి అపనిందలు ఎదుర్కోవటం బాధాకరమని, ఆమె సాహితీ ప్రతిభ సాహిత్య లోకానికి తెలుసున ని అన్నారు. మరొక పురస్కార గ్రహీత డాక్టర్ లలిత వాణి మాట్లాడుతూ ఎన్టీఆర్ పౌరాణిక చిత్రాలు పలుమార్లు చూసి తను తెలుగు సాహిత్యాన్ని అధ్యయనం చేశానని అన్నారు. ఈ కార్యక్రమానికి ముందు శృతి అకాడమీ తరపున డాక్టర్ శృతకీర్తి శిష్య ప్రశిష్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యంశాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చిల్లగట్టు శ్రీకాంత్ వ్యాఖ్యానం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జర్నలిస్టు మోహన్ కార్యక్రమానికి వందన సమర్పణ చేశారు.



**2024 లోక్సభ ఎన్నికల అనంతరం దేశవ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల నిర్వహణ పట్ల అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా ఈవీఎంల విశ్వసనీయతపై తీవ్ర చర్చ జరుగుతోంది.కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ గత కొంతకాలంగా ఈవీఎమ్ ల విశ్వసనీయతపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.**

"ఈవీఎంలు ప్రజల ఓటు హక్కును దొంగిలించే ఓ ఆయుధంగా మారాయి. ఇది ప్రజాస్వామ్యాన్ని కలుషితం చేస్తోంది. డిజిటల్ మానిప్యులేషన్ ద్వారా ప్రజల అభిప్రాయాన్ని వక్రీకరిస్తున్నారు." అన్నారు రాహుల్ గాంధీ . ఇండియా కూటమిలోని అనేక పార్టీలు – పశ్చిమ బెంగాల్, తమిళనాడు, బిహార్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో అనేక అనుమానాస్పద ఈవీఎం వ్యవహారాలను ఎన్నికల సంఘానికి నివేదించాయి. ఇందులో కొన్ని ప్రధాన అంశాలు:

- ఓటు వేసిన వెంటనే వేరే పార్టీకి పార్టీకి ఓటు నమోదైనట్లు కనిపించటం
- అధిక ఉష్ణోగ్రతలలో ఈవీఎంల పని చేయకపోవడం
- కొన్ని ప్రాంతాలలో వీవీపాట్ స్లిప్పులు ప్రింట్ అవ్వకపోవడం
- సర్వీస్ ఓట్లలో అసమానతలు, ముందస్తుగా ఓట్లు నమోదయ్యాయని ఆరోపణలు

### ప్రజాస్వామ్యానికి ప్రమాదం:

ఈవీఎమ్ లు పారదర్శకంగా లేకపోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, సంస్థలకు జవాబుదారీతనం లేకపోతే ప్రజాస్వామ్యం ఒక బూటకమవుతుందని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. ఎన్నికల సంఘం, బీజేపీ రాహుల్ గాంధీ ఆరోపణలను ఖండించింది .ఈవీఎమ్ లు ట్యాంపరింగ్ చేయడానికి వీల్లేని సురక్షితమైన పరికరాలని, అవి నెట్వర్క్కు అనుసంధానించబడవని, సాఫ్ట్వేర్ ఒక్కసారి మాత్రమే ప్రోగ్రామ్ చేయబడిందని, దానిని మార్చడం సాధ్యం కాదని ఈసీఐ స్పష్టం చేసింది. ఓటమి తర్వాత "రిఫరీని నిందించడం" సాధారణ పద్ధతిగా మారిందని ఈసీఐ వర్గాలు పేర్కొన్నాయి. అయితే వివిధ రాష్ట్రాల నివేదికలు ఇందుకు భిన్నంగా వున్నాయి.

### భిన్న నివేదికలు:

భారతదేశంలోని వివిధ రాష్ట్రాల నుండి ఈవీఎమ్ ల పనితీరు, వాటి విశ్వసనీయతపై ఎన్నికల సమయంలో అనేక ఫిర్యాదులు, ఆందోళనలు వ్యక్తమయ్యాయి:

## రాహుల్ లేవనెత్తిన కొన్ని అంశాలు పరిశీలిస్తే ..

**ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం:**
ఈవీఎమ్ లు "బ్లాక్ బాక్సు" వంటివని, వాటి పనితీరు, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పూర్తి పారదర్శకత లేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రజలకు ఈ ప్రక్రియ స్పష్టంగా అర్థమయ్యేలా ఉండాలని, లేకపోతే ఈవీఎమ్ లను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**హ్యాకింగ్ ముప్పు:**
టెస్లా సీఈఓ ఎలన్ మస్క్ ఈవీఎమ్ లు హ్యాక్ అయ్యే అవకాశం ఉందని చేసిన వ్యాఖ్యలను రాహుల్ గాంధీ ఉటంకిస్తూ, సాంకేతికంగా హ్యాకింగ్ ముప్పు ఉందని వాదించారు. ముఖ్యంగా, ముంబై నార్త్ వెస్ట్ లోక్సభ నియోజకవర్గంలో కేవలం 48 ఓట్ల తేడాతో శివసేన (షిండే వర్గం) అభ్యర్థి గెలిచినప్పుడు, ఒక పోలింగ్ అధికారి మొబైల్ ఫోన్ ద్వారా ఈవీఎమ్ లను అన్లాక్ చేశారన్న ఆరోపణలను ఆయన ప్రస్తావించారు.

### ఓట్ల లెక్కింపులో వ్యత్యాసాలు

పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య వ్యత్యాసాలు ఉన్నాయని కొన్ని సందర్భాల్లో ఆయన ఆరోపించారు. మహారాష్ట్ర ఎన్నికలలో పోస్టల్ బ్యాలెట్లను కలుపుకోకుండా ఓట్ల సంఖ్యపై తప్పుగా ఆరోపణలు చేశారని బీజేపీ, ఎన్నికల కమిషన్ స్పష్టం చేసినప్పటికీ, ఆయన ఆరోపణలను కొనసాగించారు.

# ఓటింగ్ యంత్రాల విశ్వసనీయత ఎంత?

**మహారాష్ట్ర:**
ఎన్నికల తర్వాత ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయని, ముఖ్యంగా పోలైన ఓట్ల శాతం మరియు లెక్కించిన ఓట్ల మధ్య తేడాలు ఉన్నాయని ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఎన్నికల సంఘం స్పష్టతనిచ్చింది.

**బీహార్:**
బీహార్లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగిన "ఫస్ట్ లెవల్ చెకింగ్" లో పెద్ద సంఖ్యలో ఈవీఎమ్ లు లోపభూయిష్టంగా ఉన్నట్లు గుర్తించారు (దాదాపు 12% బ్యాలెట్ యూనిట్లు, 5% కంట్రోల్ యూనిట్లు, 4.6% VVPATలు). అయితే, వీటిని మార్చి, పనితీరును ధృవీకరించిన తర్వాతే ఎన్నికలకు ఉపయోగించినట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

**కర్ణాటక, త్రిపుర, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు:**
ఈ రాష్ట్రాలలో కూడా ఎన్నికల సమయంలో ఈవీఎమ్ ల పనితీరుపై కొన్ని ఫిర్యాదులు వచ్చాయి. కొన్ని సందర్భాల్లో యంత్రాలు మొరాయించడం, ఓటర్ల జాబితాలో లోపాలు, పోలింగ్ బూత్లలో సమస్యలు వంటివి ప్రధానంగా నివేదించబడ్డాయి. అయితే, ఎన్నికల కమిషన్ ఈ ఫిర్యాదులను పరిష్కరించడానికి, అవసరమైన చర్యలు తీసుకోవడానికి ప్రయత్నించింది.

**సాధారణ ఆరోపణలు:**
చాలావరకు ఆరోపణలు ఈవీఎమ్ లు సరిగా పనిచేయడం లేదని, ఓట్లు తప్పుగా పడుతున్నాయని, లేదా ఓటింగ్ శాతం అసాధారణంగా పెరిగిందని వచ్చాయి. అయితే, ఈసీఐ ఈ ఆరోపణలను చాలావరకు "తప్పుడు సమాచారం" లేదా "అపోహలు" గా కొట్టివేసింది, ఈవీఎమ్ లు ఎలా పనిచేస్తాయి, వాటి భద్రతా చర్యలు ఏమిటి అనే విషయాలపై తరచు వివరణలు ఇచ్చింది.కాని చాల చోట్ల వాస్తవాలు ఇందుకు భిన్నంగా వున్నాయి .

### ఈవీఎమ్ లలో అక్రమాలు, అసాధారణ ఓటింగ్ సరళి:

**ఓట్ల నమోదులో అసాధారణ పెరుగుదల:**
ఎన్నికల చివరి గంటలో (సాయంత్రం 6 గంటల తర్వాత) సుమారు 51 లక్షల ఓట్లు పోలవడంపై విపక్షాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి . కోట్ల ఓట్లలో ఇంత పెద్ద సంఖ్యలో చివరి గంటలో ఓట్లు నమోదు కావడం అనుమానాస్పదమని ఒక పార్టీ పేర్కొంది.

**ఓట్ల తేడాలు:**
ఒకే పోలింగ్ బూత్లో అసెంబ్లీ అభ్యర్థికి, పార్లమెంటు అభ్యర్థికి పడిన ఓట్ల మధ్య గణనీయమైన తేడాలు ఉన్నాయని విపక్ష నాయకులు గుర్తించారు. ఉదాహరణకు,ap లోని హిందూపూర్ నియోజకవర్గంలో బూత్ నం. 28లో వైయస్సార్సీపీ పార్లమెంటరీ అభ్యర్థికి 472 ఓట్లు రాగా, అసెంబ్లీ అభ్యర్థికి కేవలం 1 ఓటు మాత్రమే వచ్చిందని తెలిపారు. ఇలాంటి వ్యత్యాసాలపై విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు.


**ఈవీఎమ్ బ్యాటరీ స్థాయిలు:**
పోలింగ్ రోజున మరియు ఓట్ల లెక్కింపు రోజున ఈవీఎమ్ బ్యాటరీ స్థాయిలలో అసాధారణ పెరుగుదల కనిపించిందని, దీనిపై విచారణ అవసరమని హర్యానా కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

**వీవీపాట్ స్లిప్పల ధృవీకరణ:**
ఈవీఎమ్ ల విశ్వసనీయతపై అనుమానాలు ఉన్నందున, వీవీపాట్ స్లిప్పులను పూర్తి స్థాయిలో ధృవీకరించడానికి అనుమతించాలనేది ఒక డిమాండ్

**ఓటర్ల జాబితా సవరణ:**
బీహార్లో చేపట్టిన తరహాలో మిగతా రాష్ట్రాల్లో కూడా ఓటర్ల జాబితాపై ప్రత్యేక, విస్తృత సవరణ చేపట్టాలని ఎన్నికల కమిషన్ను పార్టీలు కోరుతున్నాయి

**బ్యాలెట్ పత్రాలకు మారాలని డిమాండ్:**
పారదర్శకతను పెంచడానికి భవిష్యత్ ఎన్నికలలో బ్యాలెట్ పత్రాల ద్వారా ఓటింగ్ జరపాలని కూడా ఎన్నికల కమిషన్ను కొన్ని పార్టీలు కోరుతున్నాయి. ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాలలో బ్యాలెట్ పత్రాలనే ఉపయోగిస్తున్నారని కూడా అంటున్నారు. అయితే వెక్కి వెళ్ళే ప్రసక్తి లేదని ఈసీ అంటోంది .

**సీసీటీవీ ఫుటేజ్ నిరాకరణ:**
కీలక పోలింగ్ కేంద్రాల నుండి సీసీటీవీ ఫుటేజ్ను ఇవ్వడానికి కూడా కమిషన్ నిరాకరిస్తున్నది . మొత్తంగా, ఈవీఎమ్ లపై ఆరోపణలు, వాటి విశ్వసనీయతపై ఆందోళనలు భారత ఎన్నికల వ్యవస్థలో తరచు చర్చనీయాంశమవుతున్నాయి. ప్రతి ఎన్నికల తర్వాత ఈ విషయాలు తెరపైకి వస్తూనే ఉన్నాయి. దీనిపై ఎన్నికల కమిషన్ వివరణలు ఇస్తున్నప్పటికీ, ప్రతిపక్ష పార్టీలు, ఇతర వర్గాల నుండి అనుమానాలు కొనసాగుతూనే ఉన్నాయి.



- డాక్టర్. పి. విజయబాబు
సీనియర్ సంపాదకులు

## ఆంధ్రప్రదేశ్ వైయస్సార్సీపీ బృందం నుండి ఎన్నికల కమిషన్‌కు నివేదించిన అంశాలు

**ఆంధ్రప్రదేశ్లో ఇటీవల జరిగిన శాసనసభ, లోక్సభ ఎన్నికల తర్వాత వైయస్సార్సీపీ (యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ) బృందం ఈవీఎమ్ లపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఎన్నికల కమిషన్కు పలు ఫిర్యాదులు చేసింది. ముఖ్యంగా వారు లేవనెత్తిన అంశాలు:**

### ఈవీఎమ్ లలో అక్రమాలు, అసాధారణ ఓటింగ్ సరళి:

**ఓట్ల నమోదులో అసాధారణ పెరుగుదల:**
ఎన్నికల చివరి గంటలో (సాయంత్రం 6 గంటల తర్వాత) సుమారు 51 లక్షల ఓట్లు పోలవడంపై వైయస్సార్సీపీ అనుమానాలు వ్యక్తం చేసింది. నాలుగు కోట్ల ఓట్లలో ఇంత పెద్ద సంఖ్యలో చివరి గంటలో ఓట్లు నమోదు కావడం అనుమానాస్పదమని పేర్కొంది.

**ఓట్ల తేడాలు:**
ఒకే పోలింగ్ బూత్లో అసెంబ్లీ అభ్యర్థికి, పార్లమెంటు అభ్యర్థికి పడిన ఓట్ల మధ్య గణనీయమైన తేడాలు ఉన్నాయని వైయస్సార్సీపీ నాయకులు గుర్తించారు. ఉదాహరణకు, హిందూపూర్ నియోజకవర్గంలోని బూత్ నం. 28లో వైయస్సార్సీపీ పార్లమెంటరీ అభ్యర్థికి 472 ఓట్లు రాగా, అసెంబ్లీ అభ్యర్థికి కేవలం 1 ఓటు మాత్రమే వచ్చిందని తెలిపారు. ఇలాంటి వ్యత్యాసాల పై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

**ఈవీఎమ్ బ్యాటరీ స్థాయిలు:**
పోలింగ్ రోజున మరియు ఓట్ల లెక్కింపు రోజున ఈవీఎమ్ బ్యాటరీ స్థాయిలలో అసాధారణ పెరుగుదల కనిపించిందని, దీనిపై విచారణ అవసరమని పేర్కొన్నారు.

**వీవీపాట్ స్లిప్పల ధృవీకరణ:**
ఈవీఎమ్ ల విశ్వసనీయతపై అనుమానాలు ఉన్నందున, వీవీపాట్ స్లిప్పులను పూర్తి స్థాయిలో ధృవీకరించడానికి అనుమతించాలని వైయస్సార్సీపీ డిమాండ్ చేసింది. దీనికి నిర్ణీత రుసుము కూడా చెల్లించినట్లు తెలిపింది. అయితే, వీవీపాట్లను పోల్చి చూడటం సాధ్యం కాదని ఈసీఐ మొదట పేర్కొన్నట్లు నివేదించబడింది.

**ఓటర్ల జాబితా సవరణ:**
బీహార్లో చేపట్టిన తరహాలో ఆంధ్రప్రదేశ్లో కూడా ఓటర్ల జాబితాపై ప్రత్యేక, విస్తృత సవరణ చేపట్టాలని వైయస్సార్సీపీ ఎన్నికల కమిషన్ను కోరింది. దీనిపై ఈసీఐ సానుకూలంగా స్పందించినట్లు వైయస్సార్సీపీ నాయకులు తెలిపారు.

**బ్యాలెట్ పత్రాలకు మారాలని డిమాండ్:**
పారదర్శకతను పెంచడానికి భవిష్యత్ ఎన్నికలలో బ్యాలెట్ పత్రాల ద్వారా ఓటింగ్ జరపాలని వైయస్సార్సీపీ ఎన్నికల కమిషన్ను కోరింది. ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాలలో బ్యాలెట్ పత్రాలనే ఉపయోగిస్తున్నారని వైయస్సార్సీపీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి కూడా ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

**సీసీటీవీ ఫుటేజ్ నిరాకరణ:**
కీలక పోలింగ్ కేంద్రాల నుండి సీసీటీవీ ఫుటేజ్ను ఇవ్వడానికి నిరాకరించారని వైయస్సార్సీపీ బృందం ఆరోపించింది.

ఈ ఫిర్యాదులన్నింటినీ వైయస్సార్సీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు వై.వి. సుబ్బారెడ్డి, లోక్సభ నాయకుడు పి. వెంకట మిథున్ రెడ్డి, మాజీ ఎంపీ బెల్లం చంద్రశేఖర్లతో కూడిన బృందం ఎన్నికల కమిషన్ అధికారులను కలిసి వివరించింది. ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకత, విశ్వసనీయత ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.






## ఆర్థిక క్రమశిక్షణ కలిగిన గొప్ప నాయకుడు రోశయ్య

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్ నగర్, మహా:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం లో మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కీర్తి శేషులు రోశయ్య విగ్రహాన్ని ఆర్యవైశ్య సంఘము అధ్వర్యంలో ఆవిష్కరించారు.ఈ విగ్రహావిష్కరణకు ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో క్రమశిక్షణ తోపాటు పార్టీకి విధేయతగా ఉన్న గొప్ప రాజకీయ వేత్త రోశయ్య అన్నారు. రోశయ్య జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. రోశయ్యను స్ఫూర్తిగా తీసుకొని స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు పట్టణం లో పలు సామాజిక సేవలు చేస్తున్నందుకు వారిని అభినందించారు.ఇందులో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, చెన్నయ్య, బస్వమప్ప, మొహమ్మద్ ఇబ్రహీం, నాగిళ్ళ గోపాల్ గుప్తా, మలిపెద్ది శ్రీనివాస్, గుబ్బ శ్రీను, పెంటయ్య,ఆగిరు అనిల్ కుమార్ గుప్తా, రాము,మురళి మోహన్ పాల్గొన్నారు.

## పేద ఇంటి ఆడబిడ్డకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలోని ఆవరణలో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో 501మంది ,కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మార్వో బొమ్మ రాములు తో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకొని ఆర్థికంగా లబ్దిపొందాలన్నారు. రాజేంద్రనగర్ మండలంలోనే 426షాదీ ముబారక్,75 కల్యాణ లక్ష్మి, మొత్తం 501మంది పేదింటి యువతుల వివాహానికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో లబ్ధిచేకూరుస్తున్నాయి. పేదింటి యువతులకు ఆర్థిక సహాయంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు.సంక్షేమంలో తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం ముందుంది అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు రెవెన్యూ ఇన్స్పెక్టర్ సునీత రెడ్డి, డివిజన్ అధ్యక్షులు ధనంజయ్, ప్రేమ్ గౌడ్, బండారి శంకర్, శ్రీధర్ రెడ్డి, ప్రభాకర్, ఇంద్రపాల్ రెడ్డి, పార్టీ నాయకులు లబ్ధిదారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం సహకరిస్తుంది

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**




**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని హైదర్‌గూడ మాపుల్ టౌన్ లనీలో రూ 19 లక్షల వ్యయంతో నిర్మిచానున్న డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ తో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శుక్రవారం శకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ మైనార్టీ మహిళా శక్తి పథకం రేవంతన్న భరోసాను క్రిస్టియన్ మహిళల సోదరీ మణులకు 20 మంది లబ్దిదారులకు ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కల్పన, ఆర్థిక స్వాలంబనే ధ్యేయం మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వార్డు సభ్యులు, డివిజన్ పార్టీ అధ్యక్షులు ధనంజయ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ రామలింగేశ్వర సహకార సంఘాల సమితి

## నూతన కమిటీ ఎన్నిక



**షాద్‌నగర్, మహా:** షాద్‌నగర్ నియోజకవర్గం పరిసర ప్రాంతంలోని 50 గ్రామాలలో విస్తరించి ఉన్న శ్రీ రామ లింగేశ్వర సహకార సంఘాల సమితి లిమిటెడ్ వారు 202526 సంవత్సరానికి గాను తమ పాలకవర్గ అధ్యక్ష ఎన్నికలను గురువారం రామలింగేశ్వర పొదుపు సంఘం సమితి కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షులు నాగిళ్ళ కుమార్, సీఈవో పాతంగి సంపత్ కుమార్ ల ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. మొత్తం 12 వేల మంది సభ్యులతో కూడిన ఈ సమితికి అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన గుంటుక జగన్మోహన్ రెడ్డిని నూతన అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా ఏలకుర్తి రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష,ఉపాధ్యక్షులను సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన అధ్యక్షులు మాట్లాడుతూ... పొదుపు సంఘాల ద్వారా సభ్యులకు పొదుపులు, అప్పులు, బీమా సౌకర్యం కల్పించడంతో పాటు ఉపాధి అవకాశాలపై శిక్షణ ఇప్పించడం జరుగుతుందని తెలియజేశారు. పొదుపు సంఘాలు గ్రామీణ ప్రాంతాల్లో, ముఖ్యంగా మహిళల ఆర్థిక సాధికారతకు కీలకమైన వేదికలుగా నిలుస్తాయని అన్నారు. ఇవి చిన్న మొత్తాల పొదుపులను ప్రోత్సహించి, సభ్యుల మధ్య పరస్పర సహాయ సహకారాలను పెంపొందిస్తాయన్నారు. సభ్యులు తమ పొదుపుల ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు పొంది, చిన్న తరహా వ్యాపారాలు లేదా వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవచ్చు అని వారు సూచించారు. అదేవిధంగా ఉపాధ్యక్షులు ఎలకుర్తి రమేష్ మాట్లాడుతూ... ఈ సంఘాలు ఆర్థిక క్రమశిక్షణను పెంపొందించడంతో పాటు, సభ్యులకు సామాజిక, ఆర్థిక నిర్ణయాలలో భాగస్వామ్యం కల్పించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు ఇస్నాతి మహేందర్, పూజారి మల్లేష్, రాకల మల్లేష్, కటిక కృష్ణాజి, ముష్టి నరసింహులు, వివిధ గ్రామాల పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**




**షాద్ నగర్, మహా:** ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీ ద్వారానే సామాజిక న్యాయం జరుగుతుందని అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించాలంటే గ్రామ సీమ నుండి దేశ స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాల్సిన సమయం ఆసన్నమైందని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు.రాష్ట్ర రాజధాని హైదరాబాద్లోని ఎల్బీ స్టేడియంలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే రాక సందర్భంగా టిపిసిసి ఇచ్చిన పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం నుండి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున కాంగ్రెస్ సైనికులు సభకు తరిలారు. నియోజకవర్గ వ్యాప్తంగా 6 మండలాలు రెండు మున్సిపాలిటీల నుండి 600 వాహనాలు 3,000 మంది కాంగ్రెస్ పార్టీ ముఖ్య విభాగాలు, అదే విధంగా ముఖ్య కార్యకర్తలు మల్లికార్జున ఖర్గే సభకు భారీ కాన్వాయ్ తో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ నేతృత్వంలో ప్రదర్శనగా బయలుదేరడం విశేషం. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. దేశంలో రాజ్యాంగాన్ని రూపుమాపే విధంగా భారతీయ జనతా పార్టీ కుట్రలు పన్నుతోందని ఇందులో భాగంగానే జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాలను దేశవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నిర్వహించడం జరిగిందని రాజన్న పై జరుగుతున్న కుట్రను ముక్తకంఠంతో నిలదీసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సారాధ్యంలో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభకు పెద్ద ఎత్తున తరలి వెళ్లడం జరుగుతుందని అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను తొలగిస్తారని, రాజ్యాంగాన్ని మార్చుతారని ఎమ్మెల్యే శంకర్ ఆరోపించారు. రిజర్వేషన్లతో పాటు రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలంటే కేంద్రంలో బీజేపీని గద్దె దించి కాంగ్రెస్ పార్టీని దేశవ్యాప్తంగా ప్రజలు బలపరచాలని అన్నారు. బీజేపీ పాలనలో దళిత, గిరిజన మైనార్టీలతో పాటు మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, వారిపై దాడులు నిత్యం జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ మెజారిటీ ప్రజలకు రక్షణతో పాటు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే కాంగ్రెస్ పార్టీని బలపరిచి దేశ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గంలో జై బాపు జై భీమ్ జై సమిధన్ కార్యక్రమాలతో ప్రజలను చైతన్యపరచడం జరిగిందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ భారీ సమీకరణతో ముందుకు రావడం పట్ల ఆయా మండలాల అధ్యక్షులను, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులను, వివిధ విభాగాల నాయకులకు కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు..

# రాజకీయ పార్టీలకు తగ్గేదేలే...

**బీసీ సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ**

- **ఫరూక్ నగర్ మండల గ్రామ కమిటీల పూర్తి సందర్భంగా విజయోత్సవ సభ.**
- **హాజరైన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ, జిల్లా అధ్యక్షులు సదరం శ్రీనివాస్, తదితర బీసీ సేన శ్రేణులు**




**షాద్‌నగర్, మహా:** రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగడమే లక్ష్యంగా బీసీ సేన పనిచేస్తుందని, రాజకీయ పార్టీలకు తగ్గేదేలే అనే విధంగా గ్రామ గ్రామన బీసీ సేన కమిటీలను ఏర్పాటు చేస్తూ బీసీల ఐక్యతను చాటుతున్నామని బీసీ సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ అన్నారు. ఫరూఖ్ నగర్ మండలం అధ్యక్షురాలు జక్కుల జలజ ఆధ్వర్యంలో ఫరూక్నగర్ మండల పరిధిలోని 35 గ్రామ పంచాయతీల్లో బీసీ సేన కమిటీలను పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం పట్టణంలోని మల్లికార్జున కన్వెన్షన్ హాల్ లో బీసీ సేన విజయోత్సవ సభను ఏర్పాటు చేశారు. బీసీ సేన తాలూకా అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప, మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి సంయుక్త అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బీసీ సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ, జిల్లా అధ్యక్షులు సదరం శ్రీనివాస్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు మేకల వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ మాట్లాడుతూ... బీసీలు అంతా ఐక్యతగా ఉండి రాజకీయంగా అందరూ ఎదగాలనే ఈ బిసి సేన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 4% ఉన్న అగ్రవర్ణాల వారు 50 శాతం ఉన్న బీసీలను పాలిస్తున్నారని, మనమంతా ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయి వరకు ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. బిజెపి కాంగ్రెస్ లు బీసీలను నమ్మించి మోసం చేస్తున్నాయన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక శాతం బీసీలు గెలుపొందాలని, అప్పుడే అనుకున్న స్థాయిలో మనం రాణించగలుగుతామని ఆయన బిసి శ్రేణులకు వివరించారు. బీసీ అభివృద్ధి కోసం ఆర్ కృష్ణయ్య 45 ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నారని, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ బీసీ సేన అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు.

**ఎదగాలి... నిలవాలి...: జిల్లా అధ్యక్షులు సదరం శ్రీనివాస్ యాదవ్**

రాజకీయంగా, ఆర్థికంగా బీసీ లు ఎదగాలి నిలవాలని, గడప లోపల మన కులం.. గడప దాటితే బిసి కులమని బీసీ శ్రేణులకు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సదరం శ్రీనివాస్ యాదవ్ వివరించారు. జిల్లాలోనే షాద్నగర్ నియోజకవర్గంలో బీసీ సేన దూసుకుపోతుందని, ప్రతి గ్రామంలో బీసీ సేన అభివృద్ధి కోసం మహిళలు గడప దాటి రావడం అభినందనీయమని ఆయన కొనియాడారు. మహిళలను గౌరవించడం ఇంటి నుంచి మొదలుకోవాలని, అప్పుడే ఎవరు మరింత ఉన్నతంగా రాణిస్తారని ఆయన కొనియాడారు.

**జలజక్క ఆదర్శనీయం : బీసీ సేన శ్రేణులు**

బీసీ సేన ఫరూక్ నగర్ మండల అధ్యక్షురాలుగా పనిచేస్తున్న జలజక్క మనందరికీ ఆదర్శనీయమని పలువురు బీసీ శ్రేణులు కొనియాడారు. ఫరూఖ్ నగర్ మండల పరిధిలోని 35 గ్రామపంచాయతీలో గ్రామ మహిళా బీసీ సేన కమిటీలను ఏర్పాటు చేసి నియోజకవర్గంలోని ఇతర మండలాలకు ఆదర్శంగా నిలిచారని వారు అభినందనలు తెలిపారు. జలజక్కాను ఆదర్శంగా తీసుకొని బీసీ సేన ను జాతీయస్థాయిలో మరింత ఉన్నతికి తీసుకెళ్లడానికి మనమందరము కృషి చేయాలని వారు పేర్కొన్నారు.




### మత సామరస్యానికి

## ప్రతీక మొహర్రం

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు మహా :** మత సామరస్యానికి, త్యాగనిరతికి మొహర్రం పర్వదినం ప్రతీకగా నిలుస్తుందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మొహర్రం సందర్భంగా ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి ఆధ్వర్యంలో పటాన్చెరు పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా శుక్రవారం సాయంత్రం షర్బత్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లోని ప్రతి గ్రామంలో హిందూ ముస్లిం సోదరులు కలిసి నిర్వహించుకునే పండుగ మొహర్రం అన్నారు. ధర్మ పరిరక్షణ, శాంతియుత సమాజ స్థాపన కోసం మహమ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన ప్రాణ త్యాగం నుంచి నేటి సమాజం తెలుసుకోవాల్సింది ఎంతో ఉందన్నారు. సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అఫ్జల్, వెంకటేష్, షకీల్, ఇమ్రాన్, పాల్గొన్నారు.



## సీబీఐటీ కాలేజీ వద్ద


## కారు ప్రమాదం

**విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న హారియర్ కారు**

**రాజేంద్రనగర్ మహా ;** గండిపేట లోని సిబిఐటి కాలేజీ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని హరియర్ కారు బోల్తా పడిన ఘటన శుక్రవారం నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, వేగంగా వస్తున్న ఓ టాటా హారియర్ కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నార్సింగి మున్సిపల్ కమిషనర్ సంతకం ఫోర్జరీ

**పోలీసులకు ఫిర్యాదు.. నలుగురు అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు**




**రాజేంద్రనగర్ మహా;** నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి సంతకాని ఫోర్జరీ చేసిన కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజేంద్రనగర్ నార్సింగి లోని గండిపేట సబ్ రిజిస్టర్ కార్యాలయానికి గత నెల 17న నార్సింగి రెవెన్యూ పరిధిలోని 146 ఫ్లాట్ కు సంబంధించిన రిలీజ్ డేట్ నమోదు చేసేందుకు ఓ వ్యక్తి వచ్చాడు. అతని పేరు సంతోష్ అని చెప్పి నార్సింగి మున్సిపాలిటీ నుంచి జారీ చేసిన ఆక్యుఫెన్సీ సర్టిఫికెట్ (పత్రం) సమర్పించాడు. అందులో మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి సంతకం ఉన్నట్లు చూపించాడు. గండిపేట్ సబ్ రిజిస్టర్ ఆంజనేయులుకు అనుమానం రావడంతో సంబంధిత పత్రాలను తనిఖీలు చేశాడు. అయితే మున్సిపల్ కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్టు గుర్తించి వెంటనే మున్సిపల్ కార్యాలయాని తెలపడంతో కార్యాలయం నుంచి అధికారి సంతోష్ రావడంతో అక్కడి నుంచి ఆక్యుఫెన్సీ ధృవపత్రం తీసుకొచ్చిన వ్యక్తి పత్తా లేకుండా పరారయ్యాడు. వచ్చిన వ్యక్తిపై నార్సింగి పోలీస్ స్టేషన్లో మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదుతో పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. కార్వాన్ సంబంధించిన గులాం మమ్మద్ ఖాన్, ఎల్బీనగర్ కు సంబంధించిన వెంకట సత్యనారాయణ, యూసుఫ్ గూడా కు చెందిన జహంగీర్ ఆహ్మద్, ఎల్బీనగర్ కొత్తపేటకు చెందిన శివ నాగేశ్వరరావు పై కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించారు. గండిపేట్ మండల్ సబ్ రిజిస్టర్, ఆంజనేయులకు అనుమానం రావడంతో డాక్యుమెంట్లను తనిఖీలు చేశాడు. డాకుమెంట్లను తనిఖీ చేయడంతోనే సంతకం ఫోర్జరీ చేశాడని తేలింది. నార్సింగి మున్సిపల్ కమిషనర్ సంతకాని ఫోర్జరీ చేసిన కేటుగాళ్ల కటకటాల పాలయ్యారు. ఒకటికి రెండుసార్లు పత్రాలను చూసుకొని రీచక్ చేసుకోవాలని సబ్ రిజిస్టర్ ఆంజనేయులు తెలిపారు.



### టూవీలర్ పై వెళ్తున్న యువకుని

## జేబులో సెల్ ఫోన్ పేలడంతో మంటలు

**రాజేంద్రనగర్ మహా ;** టూ వీలర్ పై వెళ్తున్న యువకుని పాయింట్ జేబులో సెల్ ఫోన్ పేలిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్తాపూర్ సమీపంలో శుక్రవారం జరిగింది. శ్రీనివాస్ వివో ఫోన్ వాడుతూ జేబులో పెట్టుకుని టూ వీలర్ పై వెళ్తుండగా అత్తాపూర్ సమీపంలో జేబులో ఉన్న ఫోన్ తొడ భాగంలో వేడిగా అనిపించింది. యువకుడు వెంటనే టూ వీలర్ ని ఆపేలోపే వివో సెల్ఫోన్ పేలి మంటలు వచ్చాయి. వెంటనే శ్రీనివాస్ జేబులోంచి సెల్ ఫోన్ తీసి కింద పడేశాడు. తొడ భాగం సెల్ఫోన్ పేలడంతో చర్మము కాలింది. స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

## సమాచార కమిషనర్ అయోధ్య రెడ్డికి జర్నలిస్టుల అభినందనలు

**ఘనంగా సత్కరించిన టియుడబ్ల్యూజె.హెచ్ 143**



**మేడ్చల్ జిల్లా కాప్రా, మహా :** తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) కమిషనర్ గా నియమితులైన యాదాద్రి జిల్లా వాస్తవ్యులు సీనియర్ జర్నలిస్టు బోరెడ్డి అయోధ్య రెడ్డిని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యుజే) హెచ్ 143 మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బొమ్మ అమరేందర్ ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలియజేశారు.శుక్రవారం కాప్రా లోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుల బృందం అయోధ్య రెడ్డితో భేటీ అయ్యారు గతంలో ఉప్పల్ మేడిపల్లి మండలాలకు సంబంధించిన జర్నలిస్టులకు కాచవాని సింగారంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేసినప్పటికీ సమస్య నేటికీ పరిష్కారం కాలేదని ఈ విషయంలో జర్నలిస్టులకు న్యాయం జరిగే విధంగా చూడాలంటూ అయోధ్య రెడ్డిని జిల్లా అధ్యక్షులు బొమ్మ అమరేందర్ కోరారు. ఈ సందర్భంగా అమరేందర్ మాట్లాడుతూ యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండల గ్రామంలో సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన అయోధ్య రెడ్డి గత మూడు దశాబ్దాలు గా ఉత్తమ జర్నలిస్టుగా రాణించడమే కాకుండా,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీపీఆర్వో గా ప్రభుత్వానికి మీడియా వారధిగా అత్యుత్తమ సేవలు అందించి ఎంతో ప్రశంసలు పొంది తెలంగాణ రాష్ట్ర సమాచార చట్టం కమిషనర్ గా నియమితులు కావడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.టియుడబ్ల్యూ జె_హెచ్ .143 మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డమీది బాల్ రాజుగౌడ్ , మల్కాజ్గిరి ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు విల్సన్, గడ్డమీది గిరి గౌడ్, కాప్రా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి దొమ్మాటి కిరణ్ కుమార్, యూనియన్ ప్రతినిధులు నరేష్, శ్రీనివాస్, కృష్ణ, కుమార్ తదితరులున్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య

**ఆదిలాబాద్, మహా:** తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య అలుపెరుగని పోరాటం చేశారని సీపీఎం సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి అన్నారు. దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో శుక్రవారం నిర్వహించారు. కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండి దత్తాత్రి మాట్లాడుతూ కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంతో పాటు సామాజిక ఉద్యమాలలో ముందుండి పోరాటం చేశారని గుర్తు చేశారు. అనంతరం మెస్రం మనోహర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఇంద్రవెల్లి మండలం చుట్టుపక్క గ్రామాలలో ఆదివాసుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన గిరిజన నాయకుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు లంక రాఘవులు,సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజుల, ఐద్వా నాయకురాలు లలిత. రాధా, గంగాసాగర్ పాల్గొన్నారు



### వర్షా కాలంలో అన్ని రకాల ఉద్యోగులకు వైద్య పరీక్షలు

## అనివార్యం

**మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో వైద్య శిబిరం**

**మందమర్రి, మహా :** వర్షాకాలంలో అన్ని రకాల ఉద్యోగులకు వైద్య పరీక్షలు అనివార్యమని స్థానిక మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, పి హెచ్ సి వైద్యులు ఆర్ రమేష్ లు తెలిపారు. శుక్రవారం మందమర్రి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మునిసిపాలిటీ ఔట్సోర్సింగ్ పారిశుద్య సిబ్బంది, మెప్మా స్వయం సహాయక సంఘాల సిబ్బంది, 24 వార్డుల ఆర్పి లకుల సౌకర్యార్థం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వివిధ రకాల సిబ్బంది కొరకు హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పట్టణంలో వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలకు వారి నివాస పరిసర ప్రాంతాలలో వర్షాకాలంలో నీటి నిల్వ ఉండడం ద్వారా దోమలు కుట్టి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ప్రతినెలా ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పట్టణ వాసులు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీర్ ఎం సుమతీ, రెవిన్యూ ఆఫీసర్ పి కృష్ణప్రసాద్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ యం గోపికృష్ణ మెప్మా ఇన్చార్జి టీఎంసీ ఏ రఘురాం తదితర మున్సిపల్ సిబ్బందితో పాటు జూనియర్ డాక్టర్లు ఎం విష్ణు తేజ రెడ్డి, డాక్టర్స్ స్పందన, సూపర్వైజర్ ఎస్ కళావతి, హెల్త్ అసిస్టెంట్ లు సుజాత, రాజేశ్వరి ఆశా వర్కర్లు ఉన్నారు.

## సిగాచి పరిశ్రమ కార్మికుల దుర్మరణం దిగ్భ్రాంతి కరమైన సంఘటన




**రాజేంద్రనగర్ మహా ;** సిగాచి పరిశ్రమలలో జరిగిన ప్రమాదంలో 39 మంది కార్మికులు దుర్మరణం చెందడం యావత్ తెలంగాణ సమాజాన్ని దిగ్భ్రాంతి కలిగించిందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి చంద్రయ్య అన్నారు. చనిపోయిన కార్మిక కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం సిపిఐ కార్యాలయంలో జరిగిన ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. మాట్లాడుతూ శిగాచి పరిశ్రమ భవనం పురాతనమైనది ప్రమాదం లో పూర్తిగా నేలమట్టం కావడం వల్లే ప్రాణనష్టం ఎక్కువ జరిగిందని ఆయన వాపోయారు. పాతబడిన యంత్రాలను వాడటం శిథిలావస్థకు చేరిన భవనాలలో పరిశ్రమ నడపడం కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడారు అని ఆయన మండిపడ్డారు. నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. అన్ని మండల కేంద్రాలలో ర్యాలీలు సభలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలి 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో యావత్ కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక లోకానికి ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కే రామస్వామి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్, జిల్లా కార్యదర్శులు కే చందు యాదవ్, ఎస్ మల్లేష్, వడ్ల సత్యనారాయణ, రంగారెడ్డి ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే నరసింహ రెడ్డి, దాసరి ప్రసాద్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నెపు ప్రభువు, సక్రు నాయక్, మద్దిలేటి బాబురావు, కేతరాజు నరసింహ, స్వామి తదితరులు పాల్గొన్నారు.



### ఆయిల్ పామ్ సాగులో రైతులను

## ప్రోత్సహించాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హన్మకొండ మహా ;** జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగులో రైతులను ప్రోత్సహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగుకు తీసుకోవాల్సిన చర్యలు, రైతులకు ప్రోత్సాహంపై ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల్లో ఆయిల్ పామ్ పంట సాగు గురించిన వివరాలను ఉద్యాన శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట ప్రాముఖ్యతను రైతులకు అధికారులు తెలియజేస్తూ జిల్లాలో అధిక విస్తీర్ణంలో సాగయ్యే విధంగా కృషి చేయాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే ఆయిల్ పాం పంట సాగును వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు ప్రోత్సహించాలన్నారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్, మహా** జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. పట్టణంలోని నక్షత్ర ఆసుపత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, చికిత్స విధానాలు, రోగులకు అందిస్తున్న సౌకర్యాలు తదితర అంశాలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల వివరాలు, చార్జీల బోర్డులు, కంప్యూటరైజ్డ్ బిల్లింగ్ వ్యవస్థ, స్కానింగ్, డయాగ్నోస్టిక్ సర్వీసుల ప్రమాణాలు, ఆరోగ్య శ్రీ, ఇతర ఆరోగ్య బీమా సేవలు, డ్రగ్స్ రిజిష్టర్, మెడికల్ నిల్వల నిర్వహణ, రిజిస్టర్లను పరిశీలించారు. రోగులతో స్వయంగా మాట్లాడి... వారు పొందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు తీసుకున్నారు. ప్రజల ఆరోగ్యంపై ఆసుపత్రుల భాద్యతను గుర్తుచేసే విధంగా, అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలు పాటిస్తూ పారదర్శకంగా సేవలందించాలని కలెక్టర్ తెలిపారు. సందర్శనలో భాగంగా కొన్ని లోపాలను గుర్తించిన కలెక్టర్... ఆసుపత్రి యాజమాన్యానికి తగిన సూచనలు చేశారు. కార్డియాక్ కన్సల్టెంట్ డాక్టర్ పేరును డీఎంహెచ్వో ఆఫీసులో రిజిస్టర్ చేయనందుకు నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. విసిటింగ్ డాక్టర్స్ పేరును విధిగా డిఎంహెచ్ఓ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రోగులకు సంబంధించిన బిల్లు ను ప్రింటేడ్ కాపీలో ఇవ్వాలని సూచించారు. ధరల చాట్ ను స్పష్టంగా రెండు భాషలో పేషెంట్ కి స్పష్టంగా కనబడేటట్టు ప్రదర్శించాలని, రేట్ చాట్ కంటే అధిక బిల్లు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆరోగ్య శ్రీ కార్డు సేవలు, ఇన్స్యూరెన్స్ పై రోగికి, వాళ్ళకి సంబంధించిన వారికి అవగాహన కలిగించాలని సూచించారు. స్కానింగ్ సర్వీసులకు సంబంధించిన అధికారిక సర్టిఫికేట్లు, లింగ నిర్ధారణ నిషేధం బోర్డు ప్రదర్శించాలని సూచించారు. మెడికల్ షాప్ ను తనిఖీ చేసి లైసెన్స్ కలిగిన ఫార్మాసిస్ట్ పని చేయాలని, షెడ్యూల్ ఎక్స్ క్యాటగిరికి సంబంధించిన మందులకు లైసెన్స్ లేదన్నారు. షెడ్యూల్ హెచ్ 1 రిజిష్టర్ మెయింటైన్ చేయకపోవడం, తదితర లోపాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, హాస్పిటల్ యాక్ట్ కి విరుద్ధంగా ప్రవర్తించే హాస్పిటల్స్ పై అవసరమైతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. అనంతరం ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందిన వ్యక్తి నుండి సమాచారం తీసుకున్న కలెక్టర్... వైద్యం చేయించుకున్న వ్యక్తితో ఫోన్ ద్వారా మాట్లాడారు. వైద్యసేవల విషయంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏవైనా అధిక ఫీజులు వసూలు చేశారా అనే ప్రశ్నకు, సదరు వ్యక్తి "అలాంటిదేమీ లేదని, వైద్య సేవలు మెరుగ్గా అందించారని" వెల్లడించారు. ఈ కార్యక్రమం లో జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, శ్రీధర్, డాక్టర్ సందీప్ ఐత్వార్, డాక్టర్ శిల్ప, ఆరోగ్య శ్రీ టీమ్ లీడర్ పాల్గొన్నారు.

# కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఛలో హైదరాబాద్

## ఖర్గే సమావేశానికి ఆదిలాబాద్ నుండి తరలి వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

## నాలుగు బస్సులు , 18 కార్లలో వెళ్లిన గ్రామస్థాయి నేతలు

**ఆదిలాబాద్, మహా :** హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో సాయంత్రం కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో జరగనున్న జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ సమావేశానికి ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి గ్రామస్థాయి నేతలు శుక్రవారం ఉదయం తరలి వెళ్లారు.పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు బస్సులు, 18 కార్లలో దాదాపు 320 మంది గ్రామ స్థాయి ముఖ్య నేతలు, క్రియాశీలక కార్యకర్తలు హైదరాబాద్ తరలి వెళ్లారు.





# గ్రామీణ బంద్ ను విజయవంతం చేయాలి

**ఆదిలాబాద్, మహా:** కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న చేపట్టిన దేశ వ్యాప్త, గ్రామీణ బంద్ ను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లంకరాఘవులు అన్నారు. శుక్రవారం సీపీఎం పార్టీ కార్యాలయంలో ప్రజా, కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించి సమ్మె జయప్రదంపై చర్చించారు.. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించిన చట్టాలను కుదించి కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా నాలుగు కోడ్లుగా చేశారన్నారు. దీని కారణంగా కార్మికులు సంఘాలు పెట్టుకునే హక్కును కోల్పోతారన్నారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనం నిర్ణయాలు కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిపోతుందన్నారు. కార్మికులకు నష్టం కలిగించేలా ఉన్న నాలుగు కోడ్లను రద్దు చేయాలని ఈనెల 9న చేపట్టే సార్వత్రిక సమ్మెతో పాటు గ్రామీణ బంద్ ను విజయవంతం చేయాలని కోరారు.ప్రజా, కార్మిక, రైతు సంఘాల నాయకులు బండి దత్తాత్రి,కిరణ్, దేవేందర్, జగన్ సింగ్, దర్శనాల నగేష్ తదితరులు పాల్గొన్నారు.



# సి.ఎం.పి.ఎఫ్ పెన్షన్ క్లెయిమ్స్ త్వరగతిన పూర్తి చేయడానికి కృషి

**సీఎంపిఎఫ్ రీజనల్ కమిషనర్ హరిపచారి**

**మందమర్రి, మహా :** సి.ఎం.పి.ఎఫ్ పెన్షన్ క్లెయిమ్స్ త్వరగతిన పూర్తి చేయడానికి తీవ్రంగా కృషి చేస్తున్నామని సీఎంపిఎఫ్ రీజనల్ కమిషనర్ హరిపచారి స్పష్టం చేశారు. శుక్రవారం మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయం సమావేశ మందిరంలో ఏరియా ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీ.ఎం.పి.ఎఫ్, పెన్షన్ లకు సంబంధించిన లావాదేవిలు అన్నీ సికేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుగు తున్నట్లు వెల్లడించారు. అలాగే కొత్తగా సీ.ఎం.పి.ఎఫ్ పెన్షన్ కి సంబంధించిన క్లెయిమ్స్ త్వరగతిన పూర్తి చేయడానికి ప్రయాస్ అనే పద్ధతిని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. బొగ్గు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు జీరో పెండింగ్ గా సీ.ఎం పి.ఎఫ్ పెన్షన్ సంబంధించిన క్లైములను సెటిల్ చేస్తున్నామని అన్నారు. మధ్యవర్తులు ప్రమేయం లేకుండా సీ.ఎం.పి.ఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చునని వివరించారు. కార్మికులకు ఎలాంటి జాప్యం, ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్.ఓ.టు జి.ఎం విజయ ప్రసాద్, సి.ఎం.పి.ఎఫ్ రీజినల్ కమిషనర్ గోవర్ధన్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డి.వై.పి.ఎం ఆసిఫ్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శంకర్, సీ.ఎం.పి.ఎఫ్ రీజినల్ కార్యాలయ సిబ్బంది,అన్నిగనుల సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# క్రమశిక్షణా రాహిత్యం సహించేది లేదు

**కొండా దంపతులకు ఖర్గే హెచ్చరిక**



**మహా:** పార్టీ ఎమ్మెల్యేలు, నాయకుల మీద ఇష్టానుసారం మాట్లాడితే సహించేది లేదని మంత్రి కొండా సురేఖ దంపతులను మల్లికార్జునఖర్గే హెచ్చరించినట్టు తెలిసింది. వరంగల్‌లో కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు ముదిరి పాకానపడిన విషయం తెలిసిందే. మంత్రి కొండా సురేఖ దంపతులు ఒక వర్గంగా, ఎమ్మెల్యేలు కడియం, రేవూరి, నాయిని, ఎమ్మెల్సీ సారయ్య మరో వర్గంగా ఒకరిపై ఒకరు పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఖర్గే కొండా దంపతులను పిలిపించి మాట్లాడినట్టు తెలిసింది. విభేదాలకు దారితీసిన విషయాలను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం.

# విద్యాసంస్థలా లేక వ్యాపార సంస్థలా?

- కార్పొరేట్ విద్య పేరుతో ఫీజుల దోపిడి
- విద్యాశాఖ నిబంధనలు బేఖాతర్ చేస్తున్న యాజమాన్యాలు
- యూనిఫాం లు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అధిక ధరలకు విక్రయాలు
- ఐఐటీ, ఐపిఎల్ ఆయా శిక్షణ పేరుతో ఫీజు అదనం
- బెంబేలెత్తుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు




**వరంగల్ మహా;** విద్యాసంవత్సరం మొదలై పేద మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రుల గుండెల్లో గుబులు రేపుతోంది. సాధారణ ఖర్చులతో పాటు జూన్ జూలై నెలల్లో స్కూలు ఫీజులు, ఇతర సామగ్రి కొనుగోలు బాదర బందీ మొదలవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తే పిల్లలకు సరైన విద్య అందుతుందో లేదో అని భావిస్తున్న తల్లిదండ్రులు తల తాకట్టు పెట్టి అప్పు సప్పులు చేసి ప్రైవేటు పాఠశాలల్లో చదివించేందుకు సిద్ధమవుతున్నారు. మిత్రుల వద్ద చేబదుళ్లు, అవసరమైతే వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తీసుకుంటున్నారు. వారి బలహీనతే ప్రవేట్ విద్యాసంస్థలకు జేబులు నింపుతున్నాయి. ఇక విద్యా సంవత్సరం మొదలు కాగానే విద్యాసంస్థల యాజమాన్యాలు తల్లిదండ్రుల రక్త మాంసాలు పిండి ఫీజులు పెంచినట్లు ఫస్ట్ ఇన్స్టాల్మెంట్ కింద వసూలు చేస్తున్నారు. అష్ట కష్టాలు పడి తల్లిదండ్రులు ఇన్స్టాల్మెంట్లో ఫీజు చెల్లించిన తర్వాత బెల్టు, టై, డైరీ, యూనిఫాం, వర్క్ బుక్స్ పేరుతో వేలకు వేలు డబ్బు గుంజుతున్నారు. అంతేకాకుండా డిజిటల్ క్లాసులు, స్మార్ట్ టీవీలు, ఐఐటీ ఫౌండేషన్, జేఈఈ, ఐపీఎల్, నీట్ శిక్షణ పేర్లతో తల్లిదండ్రులను ఆకర్షించి అదనంగా డబ్బు వసూలు చేస్తున్నారు.

**విచ్చలవిడిగా అడ్మిషన్లు..**

వరంగల్ హనుమకొండ జిల్లాల్లో యాజమాన్యాల ఫీజులుం' మరీ ఎక్కువగా ఉంది. విద్యా సంవత్సరం మొదలు కాగానే ఫీజు తో పాటు బెల్టులు, టై, డైరీ, యూనిఫాం, వర్క్ బుక్స్ తమ వద్దే కొనుగోలు చేయాలని హుకుం జారీ చేస్తున్నాయి. తాము బయట తక్కువ ధరకు కొనుగోలు చేస్తామన్న యాజమాన్యాలు అందుకు అంగీకరించడం లేదు. కొంతమంది స్కూల్ యాజమాన్యాలు విద్యాశాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ ఆదేశాలను దృష్టిలో పెట్టుకొని ఈ వ్యాపార దందాను ఆయా స్కూల్ సమీపంలో ఉన్న ప్రైవేట్ బుక్ స్టాల్ తో పర్సంటేజీలు మాట్లాడుకొని వాటిలో గుర్తుచప్పుడు కాకుండా ఈ దందాను కొనసాగిస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యాశాఖ నిబంధనలు పట్టించుకోకుండా తరగతి గదుల పరిమితికి మించి 20.50 శాతం ఎక్కువగా అడ్మిషన్లు ఇస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా యాజమాన్యాలు విద్యాలయాలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తూ, విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నాయి. చట్టం ప్రకారం ప్రతి స్కూల్ యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులు కమిటీని ఏర్పాటు చేయాలి. వారితో ఒక సమావేశం నిర్వహించి వారి సమ్మతి తోనే ఫీజులు నిర్ణయించాల్సి ఉంటుంది. కానీ ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఆ పనిచేయం లేదు. అలాగే నిబంధనల ప్రకారం విద్యాసంస్థల్లో పాఠ్య పుస్తకాలు, ఇతర సామగ్రి విక్రయించకూడదు. కొన్ని యాజమాన్యాలు స్కూళ్లో విక్రయాలు జరిపిస్తే, విద్యార్థి సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుందని గుర్తించి, ప్రత్యేకంగా మధ్యవర్తులను నియమిం చుకుంటున్నాయి. స్కూల్ ప్రాంగణంలో కాకుండా వేరే ప్రాంతాలలో దీనిని కొనసాగిస్తున్నారు.

**ప్రైవేట్ స్కూళ్లలో ధరలు ఇలా..**

బయట ఒక డైరీ ధర రూ.50 నుంచి రూ.100 లోపే ఉండగా యాజమాన్యాలు రూ.200కు విక్రయిస్తున్నాయి. యూనిఫాం బయట రూ. వెయ్యిలోపు లభిస్తుండగా యాజమా న్యాలు రూ.2 వేల వరకు వసూలు సచేస్తు న్నాయి. ఐడీ కార్డులు టోకుగా చేయిస్తే రూ. 50లోపే ఖర్చవుతుండగా యా జమాన్యాలు రూ.200 వరకు తీసు కుంటున్నాయి. బూట్లు రూ.250 లోపు మార్కెట్లో లభిస్తుండగా రూ.500 వరకు విక్రయిస్తున్నాయి. టీషర్ట్ బయట మార్కెట్లో రూ.200లోపు దొరుకుతుండగా, యాజ మాన్యాలు రూ.500 వరకు వసూలు చేస్తున్నాయి. విద్యాసంస్థలు సాధారణంగా ప్రభుత్వం విడుదల చేసిన పాఠ్యపుస్తకాల ఆధారంగానే విద్యార్థులకు పాఠాలు బోధించాలి. కానీ, యాజమాన్యాలు వర్క్ బుక్స్ పేరు తో తల్లిదండ్రుల నుంచి భారీగా డబ్బు వసూలు చేస్తున్నాయి. ఒకటో తరగతికి తక్కువలో తక్కువ రూ 2వేల నుంచి, పదో తరగతికి రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. అలాగే వార్షిక ఫీజులు సైతం ప్రభుత్వ నిబంధనలకు లోబడి వసూలు చేయాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో అవి అమలు కావడం లేదు. ప్రభుత్వం సూచించిన ఫీజు కంటే అదనంగా రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నాయి. ఇవి కాక యోగ, కరాటే శిక్షణ ఉంటే.. ఆ ఫీజులు కూడా చెల్లించాల్సిందే. ఇన్ని ఫీజులు కట్టిన, యాజ మాన్యాలు క్వాలిఫైడ్ టీచర్లతో పాఠాలు చెప్పించడం లేదని, అంతంతమాత్రం సామర్థ్యాలు ఉన్న వారితో కాని చ్చేస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.

**ఫీజుల వసూళ్ల పై హైకోర్టులో 'పిల్'**

ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీ పై ఇటీవల హనుమకొండ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. పాఠశాలల యాజమాన్యాలు పేరెంట్ కమిటీ సమావేశాలు నిర్వ హించడం లేదని, నిపుణులైన ఉపాధ్యాయులను నియమించడం లేదని, పాఠశాలలకు ఆట మైదానాలు లేవని ఫిర్యాదులో పేర్కొన్నారు. పిల్పై రాష్ట్ర విద్యాశాఖ నుంచి స్పందన వచ్చింది. జిల్లాస్థాయిలో విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని చర్యలు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ వీటన్నింటినీ బేఖాతరు చేస్తూ ప్రైవేటు స్కూల్ యజమాన్యాలు వారి ఇష్టానుసారం ఫీజులు పెంచుతూ పై తెలిపిన నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి





**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**(యాదాద్రి భువనగిరి మహా న్యూస్)**

విద్యార్థిని, విద్యార్థులకు అందించే మధ్యాహ్నం భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని, నాణ్యమైన భోజనాన్ని వండాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం రోజు భువనగిరి పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ,హాస్టల్ ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. స్కూల్,హాస్టల్ యొక్క నిర్వహణ తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ లో విద్యార్థులకు వండిన మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. వండిన అన్నం, గుడ్లు, పెరుగు, కూరలు పరిశీలించారు. విద్యార్థులను భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈరోజు ఏం భోజనం పెట్టారు మెనూ పాటించారా లేదా అని విద్యార్థులను, ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మెనూలో ఉన్నది కాకుండా పిల్లలకు వేరేది వండి పెడితే కఠిన చర్యలు తప్పదన్నారు. విద్యార్థులకి పెట్టే భోజనంలో నాణ్యత సరిగా లేదని అన్నారు. విద్యార్థులకు వండే భోజనం నాణ్యత ప్రమాణాలు పాటించాలి అన్నారు. విద్యార్థులకి మెనూ ప్రకారం అందాల్సిన ఆహారం కచ్చితంగా పెట్టాలని, లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. చింతపండు నాణ్యత లేదని మార్చుకోవాల్సి సూచించారు. మెనూ సరిగా పాటించకపోతే వార్డెన్ పై చర్యలు తప్పవని హెచ్చరించారు.



# దొడ్డి కొమురయ్య పోరాటం మరువలేనిది

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, మహా:** ఆధిపత్య ధోరణికి, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా దొడ్డి కొమురయ్య చేసిన ఉద్యమాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొమురయ్య వర్ధంతిని అధికారికంగా నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యేలు కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొమురయ్య చేసిన పోరాటాలు, చైతన్య కార్యక్రమాలను వివరించారు. మహానీయుల జీవిత చరిత్రను అందరికి తెలియజేసేలా ప్రభుత్వం వారి జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహిస్తోందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజలింగు పాల్గొన్నారు.

# నరేంద్ర మోడీ వల్లనే భారత్ ఆర్థిక శక్తిగా ఎదిగింది

**ఇంటింటికి పాజాప విజయాల కరపత్రాలు**



**మంచిర్యాల, మహా :** భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ చలవ వల్లనే భారత్ ఆర్థిక శక్తిగా ఎదిగిందని భారతీయ జనతా పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం చెన్నూరు పట్టణ పురవీధుల్లో నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాల కరపత్రాలను ఇంటింటికి, షాపు షాపుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ 11 సంవత్సరాల సుస్థిర సమర్థ పాలన వల్లనే ప్రపంచంలో నాలుగవ ఆర్థిక శక్తిగా ఎదిగిందని ఆయన పొగడ్తలతో ముంచెత్తారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఇంట్లో స్వచ్ఛభారత్ పథకం కింద మరుగుదొడ్ల పథకాన్ని అమలు చేసి మహిళల ఆత్మ గౌరవాన్ని కాపాడాలని వెల్లడించారు. దేశంలో నిరు పేదలు ఆకలితో పస్తులు ఉండకూడదని భావించి తెల్ల కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉచితంగా ఐదు కిలోల బియ్యం పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. అంతే కాకుండా ఆరోగ్య బీమా పథకం ద్వారా ప్రతి ఒక్కరికి ఐదు లక్షల రూపాయల ఆరోగ్య భీమా ఏర్పాటు చేశారని తెలిపారు. (కోవిడ్19) కరోనా వైరస్ కారణంతో యావత్ ప్రపంచ దేశాలు మందులు లేక తల్లడిల్లుతుంటే నరేంద్ర మోడీ సర్కార్ వివిధ దేశాలకు ఉచితంగా మందులు సరఫరా చేశారని కీర్తించారు.

# వినతులను సకాలంలో పరిష్కరించాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**




**వరంగల్ మహా;** వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన వినతులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ఆర్ టి ఐ యాక్ట్, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కరణ పురోగతి, శాఖల వారిగా కార్యాచరణ ప్రణాళిక పై సమీక్షించి సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్టీ ఐ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, చట్టం అమలు, ఎదురయ్యే సవాళ్లు చట్టాన్ని సమర్థవంతంగా ఉపయోగించడం వంటి అంశాలపై కలెక్టర్ అధికారులకు కూలంకషంగా వివరించారు. పౌరులు కోరిన సమాచారాన్ని సకాలంలో సరైన రూపంలో అందించాలని సూచించారు. ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత జవాబుదారీతనం పెంచడానికి ఆర్టీ ఐ చట్టం అమలు చేయడం జరుగుతున్నదని తెలిపారు. ముఖ్యంగా ప్రజావాణి దరఖాస్తుల పరిష్కార పురోగతిని సమీక్షిస్తూ ప్రతివారం స్వీకరించిన సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఆ వారంలోనే ఖచ్చితంగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు వారి శాఖల ద్వారా అమలు చేసే కార్యాచరణ ప్రణాళిక వెంటనే సమర్పించాలని కలెక్టర్ అన్నారు.



# కాలేజీ అనుబంధ హాస్టల్లో డ్రగ్స్ కంట్రోల్ టీం తనిఖీలు

**హన్మకొండ మహా;** డ్రగ్స్ నియంత్రణలో భాగంగా వరంగల్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు డ్రగ్ కంట్రోల్ విభాగం పోలీసులు శుక్రవారం కిట్స్, ఎస్. ఆర్ కళాశాలలకు అనుబంధంగా ఉన్న హాస్టల్స్ లో పోలీస్ శునకాలతో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు హాస్టల్స్ బస చేసిన విద్యార్థులను బ్యాగ్‌లను తనిఖీ చేయడంతో పాటు వారి వ్యక్తిగత వివరాలను అడిగి తెలుసుకున్నారు.



# తాటి చెట్టు పైనుంచి జారిపడి గీత కార్మికుడి మృతి

**రంగారెడ్డి జిల్లా మహా:** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పోల్కంపల్లిలో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి, పోల్కంపల్లి గ్రామ సమీపంలోని బొత్తల ఒంపు ప్రాంతంలో కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కిన గీత కార్మికుడు, గుండ్ల జంగయ్య గౌడ్, ప్రమాదవశాత్తూ చెట్టు పైనుంచి కింద పడిపోయాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.



# సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్య శిబిరం

**ఆదిలాబాద్, మహా:** సీజనల్ వ్యాధులతో పాటు టీబీ రహిత సమాజం కోసం కృషి చేస్తున్నామని హమాలివాడ అర్బన్ పీహెచ్సీ వైద్యుడు రెహన్ అహ్మద్ అన్నారు. శుక్రవారం భుక్తపూర్లో హమాలీవాడ యూపీహెచ్ సి ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. సీజనల్ వ్యాధులతో పాటు టీబీ ముక్త్ భారత్ అభియాన్లో భాగంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించారు. ఎక్స్ రేతో పాటు తెమడ, రక్తం, షుగర్ టెస్టులు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రెహన్ అహ్మద్ మాట్లాడుతూ... వర్షా కాలం ప్రారంభమైందని, సీజనల్ వ్యాధులు కూడా ప్రబలుతాయన్నారు. వాటి నివారణతో పాటు టీబీ ముక్త్ భారత్ అభియాన్లో భాగంగా ప్రజలకు వ్యాధులపై అవగాహన, పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బండారి సతీష్, హెల్త్ సెంటర్ సిబ్బంది నాగరాజు, రమాదేవి, సుమలత,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన లంచావతారం డిప్యూటీ తహసిల్దార్

**ఒక రైతు నుండి 10 వేలు తీసుకుంటూ పట్టుబడిన వైనం**

**మంచిర్యాల, మహా :** కోటపల్లి తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ గా విధులు నిర్వహిస్తున్న అక్కిరెడ్డి నవీన్ రాజారాం గ్రామానికి చెందిన నరేష్ అనే రైతు నుండి 10 వేల రూపాయలు లంచంగా తీసుకుంటూ ఆదిలాబాద్ ఏసీబీ డిఎస్పి మధు చిక్కిన వైనం శుక్రవారం కలకలం రేపింది. అదిలాబాద్ ఏసీబీ డి.ఎస్.పి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా, కోటపల్లి మండలం, రాజారాం గ్రామానికి చెందిన నరేష్ అనే రైతు తనకున్న 20 గుంటల వ్యవసాయ భూమికి పట్టా పాస్ పుస్తకంలో పేరు సరి చేయడం కొరకు కోటపల్లి డిప్యూటీ తాసిల్దార్ నవీన్ ను గత మూడు రోజుల క్రితం కలిశాడని తెలిపారు. అయితే దానికి 15 రూపాయలు లంచంగా ఇస్తేనే సరి చేస్తానని నవీన్ రైతుకు చెప్పినట్లు వివరించారు. కాగా తన వద్ద అన్ని డబ్బులు లేవు అని బ్రతిమిలాలగా చివరికి పదివేల రూపాయలు ఇవ్వాలని డిప్యూటీ తాసిల్దార్ డిమాండ్ చేసినట్లు చెప్పారు. దీనితో బాధిత రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు తెలిపారు. అంజి అనే ఓ వ్యక్తి ద్వారా శుక్రవారం 10 వెలు తీసుకుంటుండగా డిప్యూటీ తాసిల్దార్ నవీన్ ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. దీనితో కేసు నమోదు చేసుకొని వీరిరువురిని కోర్టుకు హాజరు పరుచనున్నట్లు పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలలో విధులు నిర్వహిస్తున్న అధికారులు ఎవరైనా పనులు చేయాలంటే డబ్బులు కావాలని డిమాండ్ చేస్తే తమ శాఖకు సమాచారం అందించాలని ఆయన తెలిపారు. ఇది ఇలా ఉండగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటివరకు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ వారి సంఖ్య నాలుగుకు చేరింది. ఒకవైపు ఉన్నత చదువులు చదివిన యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక తల్లాడిందుతుంటే, పర్మినెంట్ ప్రభుత్వ ఉద్యోగాలు నిర్వహించే ఉద్యోగులు లంచాలు డిమాండ్ చేసి కాటకటాల పాలవడం పై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా వివిధ శాఖలలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు మాని ప్రజలకు సేవలందించాలని కోరుతున్నారు.



# తడి పొడి చెత్తను వేరుగా సేకరించండి

**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

**వరంగల్ మహా;** తడి పొడి చెత్తను వేరుగా సేకరించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. మహా నగర పాలక సంస్థ వరంగల్ ప్రాంతంలోని పోతన నగర్ లో నిర్వహిస్తున్న ట్రాన్స్ఫర్ స్టేషన్ ను కమిషనర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్వహణ తీరు ను అధికారులను అడిగి తెలుసుకొని సమర్థవంతం గా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ ట్రాన్స్ఫర్ స్టేషన్ నిర్వహిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు అవసరం మేరకు యంత్రాలకు మరమ్మతులు చేయించేలా చూడాలని ట్రాన్స్ ఫర్ స్టేషన్ ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని స్వచ్ఛ ఆటోలు తడి పొడి చెత్త ను వేయడానికి వీలు గా వేరుగా కంపార్ట్మెంట్లు ఉండేలా చూడాలని ఖచ్చితంగా ప్రజల నుండి తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించేలా ప్రోత్సహించి అవగాహన కలిగించాలని ట్రాన్స్ఫర్ స్టేషన్ ను మరింత బలోపేతం చేసి చెత్త తరలింపులో వేగం పెరిగేలా చూడాలని కమిషనర్ అన్నారు.



## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం స్వల్ప లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఇండెక్స్ 193.42 పాయింట్లు లేదా 0.23 శాతం పెరిగి 83,432.89 వద్ద ముగియగా, నిఫ్టీ 55.7 పాయింట్లు లేదా 0.22 శాతం పెరిగి 25,461 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ లోని 30 షేర్లలో 20 షేర్లు లాభాల్లో ముగిశాయి. బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్సీఎల్ టెక్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్సర్వ్ టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. విస్తృత మార్కెట్లలో, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ప్రతికూల దిశలో ఫ్లాట్‌గా స్థిరపడింది. నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 0.03 శాతం పెరిగింది. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ ఆటో, మెటల్ మినహా మిగతా అన్ని రంగాలు లాభాల్లో ముగిశాయి. భారత్ పెట్రోలియం, ఐజీఎల్, ఇండియన్ ఆయిల్, మహానగర్ గ్యాస్, హిందుస్థాన్ పెట్రోలియం షేర్లు లాభపడటంతో నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ 1.05 శాతం లాభపడింది. నిఫ్టీ రియల్టీ, ఫార్మా, ఐటీ, బ్యాంక్, మీడియా, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ 1 శాతం వరకు లాభపడ్డాయి. మార్కెట్ ఒడిదుడుకులను అంచనా వేసే ఇండియా వీఐఎక్స్ 0.57 శాతం క్షీణించి 12.32 పాయింట్ల వద్ద స్థిరపడింది.

# హోమ్ లోన్ కస్టమర్లు మరింత హ్యాపీ

హోమ్ లోన్ గ్రహీతలకు ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా మరోసారి శుభవార్త చెప్పింది. గృహ రుణాలపై వడ్డీ రేటును 7.45 శాతానికి తగ్గించింది. ప్రస్తుతం ఇది 7.50 శాతంగా ఉంది. అలాగే కొత్త రుణ గ్రహీతలకు ప్రాసెసింగ్ ఫీజును కూడా మాఫీ చేసినట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రకటించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) పాలసీ రెపో రేటును తగ్గించిన తరువాత గత జూన్‌లో బ్యాంక్ ఆఫ్ బరోడా ఇప్పటికే గృహ రుణ రేట్లను 8.00 శాతం నుండి 7.50 శాతానికి తగ్గించింది. ఇప్పుడు వడ్డీ రేటును ఇంకాస్త తగ్గించడంతో హోమ్‌లోన్ కస్టమర్లకు మరింత ఉపశమనం కలగనుంది. ఈ తాజా తగ్గింపు గృహ యాజమాన్యం మరింత చౌకగా మారుతుందని, దేశంలోని గృహ రంగంలో డిమాండ్‌ను ఉత్తేజపరిచే ప్రభుత్వ విస్తృత ఆర్థిక లక్ష్యానికి మద్దతు ఇస్తుందని భావిస్తున్నారు.

### జీరో ప్రాసెసింగ్ ఫీజు

గృహ రుణాలను మరింత చేరువ చేయడంలో భాగంగా బ్యాంక్ ఆఫ్ బరోడా కొత్తగా హోమ్ లోన్‌కు దరఖాస్తు చేసుకునేవారికి ప్రాసెసింగ ఫీజును కూడా రద్దు చేసింది. ఇంతవరకూ ఈ బ్యాంక్ లోన్ మొత్తంలో అర శాతం వరకూ ప్రాసెసింగ్ రుసుముగా తీసుకొనేది. ఇది గరిష్టంగా రూ.15 వేల వరకూ ఉంటుంది. దీనికి జీఎస్టీ అదనం. కస్టమర్లు లోన్ కోసం బ్యాంక్ బ్రాంచిల్లోనే కాకుండా పూర్తిగా డిజిటల్ విధానంలో బ్యాంక్ వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.





# రియల్ ఎస్టేట్‌లో ఆ పెట్టుబడులు తగ్గాయ్..

భారత రియల్ ఎస్టేట్ మార్కెట్లో సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు (ఇనిస్టిట్యూషన్స్) నీరసించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల్లో (ఏప్రిల్-జూన్) క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 33 శాతం తగ్గిపోయి 1.69 బిలియన్ డాలర్లు (14,365 కోట్లు)గా ఉన్నట్టు కొలియర్స్ ఇండియా వెల్లడించింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితులు ఇందుకు దారితీసినట్టు తెలిపింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఇనిస్టిట్యూషన్స్ 2.53 బిలియన్ డాలర్లను (రూ.21,505 కోట్లు) రియల్ ఎస్టేట్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేయడం గమనార్హం. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే సగానికి తగ్గి 1,048 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మాత్రం 643 మిలియన్ డాలర్లను ఇన్వెస్ట్ చేశారు. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 486 మిలియన్ డాలర్ల పెట్టుబడుల కంటే 32 శాతం అధికమయ్యాయి.

**దేశీ పెట్టుబడుల అండ..**

'దేశీ పెట్టుబడులు రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు కీలక చోదకంగా మారాయి. భారత రియల్ ఎస్టేట్‌లో దేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా 2021లో 16 శాతంగా ఉంటే, అక్కడి నుంచి క్రమంగా పెరుగుతూ 2024 నాటికి 34 శాతానికి చేరింది' అని కొలియర్స్ ఇండియా సీఈవో బాదల్ యాజ్ఞిక్ తెలిపారు. ఇక 2025 మొదటి ఆరు నెలల కాలంలో రియల్ ఎస్టేట్ పెట్టుబడుల్లో దేశీ పెట్టుబడుల వాటా 48 శాతంగా ఉన్నట్టు చెప్పారు. దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు పెరగడం.. అంతర్జాతీయ అనిశ్చితుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సాయపడ్డాయని, మొదటి ఆరు నెలల్లో మొత్తం పెట్టుబడులు 3 బిలియన్ డాలర్లకు దూసుకువెళ్లాయని తెలిపారు. ఈ ఏడాది జనవరి-జూన్ మధ్యకాలంలో రియల్ ఎస్టేట్ మార్కెట్లో ఇనిస్టిట్యూషనల్ పెట్టుబడులు 15 శాతం తగ్గి 2,998 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. మొదటి ఆరు నెలల్లో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న 2,594 మిలియన్ డాలర్ల నుంచి 1,571 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. దేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు మాత్రం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 53 శాతం ఎగసి 1,427 మిలియన్ డాలర్లకు చేరాయి. ఫ్యామిలీ ఆఫీసులు, విదేశీ కార్పొరేట్ గ్రూప్‌లు, విదేశీ బ్యాంక్‌లు, ప్రొప్రయిటరీ బుక్‌లు, పెన్షన్ ఫండ్స్, ప్రైవేటు ఈక్విటీ సంస్థలు, ఎన్‌బీఎఫ్‌సీలు, లిస్టెడ్ రీట్‌లు సంస్థాగత పెట్టుబడిదారుల కిందకు వస్తాయి.

## వైజాగ్‌లో వొడాఫోన్ ఐడియా 5జీ..
# మరిన్ని నగరాల్లోనూ..



ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియా తమ 5జీ సర్వీసులను మరో 23 నగరాలకు విస్తరించింది. వీటిలో వైజాగ్‌తో పాటు జైపూర్, కోల్‌కతా, లక్నో తదితర సిటీలు ఉన్నట్లు సంస్థ తెలిపింది. ప్రారంభ ఆఫర్ కింద రూ.299 నుంచి డేటా ప్లాన్లను అందిస్తున్నట్లు వివరించింది. కంపెనీ ఇప్పటికే ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, చండీగఢ్, పట్నా లాంటి అయిదు నగరాల్లో 5జీ సేవలు అందిస్తోంది. 22 టెలికం సర్కిళ్లకు గాను 17 సర్కిళ్లలో 5జీ స్పెక్ట్రమ్‌ను వొడా-ఐడియా కొనుగోలు చేసింది. 4జీ సేవలకు సంబంధించి సుమారు 65,000 సైట్లలో నెట్‌వర్క్‌ను పటిష్టం చేసుకున్నామని, కవరేజీని మెరుగుపర్చామని కంపెనీ పేర్కొంది. వచ్చే ఆరు నెలల్లో కొత్తగా 1 లక్ష టవర్లను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు తెలిపింది.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL





# అట్టుడుకుతున్న యూరప్

**బెర్లిన్:** యూరప్ దేశాల్లో వడగాడ్పుల తీవ్రత కొనసాగుతోంది. ఇప్పటివరకు స్పెయిన్‌లో నలుగురు, ఇటలీ, ఫ్రాన్స్‌లో ఇద్దరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. కార్చిచ్చు ముప్పు పొంచి ఉండటంతో ప్రభుత్వాలు ముందు జాగ్రత్త చర్యలకు ఉపక్రమించాయి. స్విట్జర్లాండ్‌లోని బెజ్‌నౌ అణు రియాక్టర్‌ను మూసివేశారు. మరో అణు రియాక్టర్‌లో విద్యుదుత్పత్తిని సగానికి తగ్గించారు. స్పెయిన్‌లోని కాటలోనియా ప్రాంతంలో కార్చిచ్చుతో ఇద్దరు చనిపోయారు. ఎండల వేడిమికి తాళలేక 300 మంది ఆస్పత్రి పాలయ్యారని ఫ్రాన్స్ మంత్రి ఒకరు వివరించారు. ఇటలీ ప్రభుత్వం 18 నగరాల్లో రెడ్ అలెర్ట్ ప్రకటించింది. జర్మనీలోని అత్యధిక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటాయి. దీంతో, జనం వేడి నుంచి ఉపశమనం కోసం ఓపెన్ ఎయిర్ స్విమ్మింగ్ పూల్స్, సరస్సులను ఆశ్రయిస్తున్నారు. జర్మనీలోని చాలా ప్రాంతాల్లో స్కూళ్లను మూసివేశారు. బ్రాండెన్‌బర్గ్, సాగ్జనీల్లో పలు ప్రాంతాల్లో మొదలైన కార్చిచ్చును ఫైర్ సిబ్బంది అదుపులోకి తెచ్చారు. పర్యాటక ప్రాంతాలైన పారిస్‌లోని ఈఫిల్ టవర్‌తోపాటు బ్రస్సెల్స్‌లోని అటోమియంను మూసివేశారు.

# యూపీ, కేరళ విద్యార్థులతో శుభాంశు మాటామంతీ

**ఐఎస్ఎస్ లోపలి వాతావరణాన్ని చూసి అబ్బురపడిన విద్యార్థులు.. విద్యార్థుల ప్రశ్నలకు సావధానంగా శుక్లా సమాధానం**

**లక్నో/తిరువనంతపురం:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లోని భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లాతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి కేరళ, ఉత్తరప్రదేశ్ పాఠశాల విద్యార్థులు అత్యంత అరుదైన, మాటల్లో చెప్పలేని అనుభూతిని పొందారు. భారరహిత స్థితిలో స్వేచ్ఛగా గాల్లో కదలాడుతూ బంతితో ఆడుకుంటున్న శుక్లాను చూసి ఆ విద్యార్థులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. పట్టరాని ఆనందంతో పదే పదే ప్రశ్నలు సంధించారు. వాళ్ల ప్రశ్నలకు శుక్లా వివరణాత్మక సమాధాలిచ్చారు. "ఆయన అలా శూన్యస్థితిలో చక్కర్లు కొడుతుంటే ఎంతో చూడముచ్చటగా ఉంది. మేము అడిగిన ఎన్నో ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. ఐఎస్ఎస్‌లో ఎలా గాల్లో ఈదినట్లుగా ముందుకు కదలాలో ఆయన స్వయంగా కదిలి చూపించారు" అని కోజికోడ్‌లోని నయార్‌కుళి ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని సంఘవి చెప్పారు. శుక్లా సొంతూరు లక్నోలో, తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లోని విద్యార్థులూ ఆయనతో మాట్లాడారు. ఐఎస్ఎస్‌లో ఉన్నప్పుడు వ్యోమగాములు ఎలాంటి ఆహారం తీసుకుంటారు?. అలా కదులుతూ ఉంటే నిద్రపోవడమెలా?. హఠాత్తుగా ఒంట్లో బాగోలేకపోతే డాక్టర్ ఉండరుగా. అప్పుడెలా?. ఇక్కడి నుంచి ఐఎస్ఎస్‌కు వెళ్లాక ఎంతకాలానికి అక్కడి వాతావరణానికి అలవాటుపడతారు?. తిరిగొస్తే ఇక్కడ మామూలుగా మారడానికి ఎంత టైమ్ పడుతుంది?.. ఇలా విద్యార్థులు అడిగిన ఎన్నో ప్రశ్నలకు శుక్లా సమాధానాలు చెప్పారు. "ఐఎస్ఎస్‌లో నిద్రపోవడం ఒక సరదా పని. ఇక్కడ నేల, పైకప్పు రెండూ ఉండవు. అందుకే కొందరు గోడలకు, కొందరు సీలింగ్‌కు అతుక్కుని నిద్రిస్తూ కనిపిస్తారు. కదలకుండా పడుకోవాలంటే నిద్రపోయే స్లీపింగ్ బ్యాగ్‌ను దేనికైనా కట్టేసుకోవాల్సిందే" అని ఆయన నవ్వుతూ చెప్పారు. దీంతో విద్యార్థులు విరగబడి నవ్వారు. "ఇక్కడి వచ్చినప్పటితో పోలిస్తే ఇప్పుడు నేను ఎంతో మెరుగ్గా ఉన్నా. భారరహిత స్థితికి అలవాటు పడటం కాస్తంత ఇబ్బందిగా ఉంటుంది. తిరిగి భూమి మీదకొచ్చాక గురుత్వాకర్షణ స్థితికి మారడం కూడా ఒక సవాలే" అని శుక్లా అన్నారు. "ఒంటరిగా ఉన్నామని ఫీల్ అయితే వెంటనే కుటుంబసభ్యులు, స్నేహితులతో వర్చువల్‌గా మాట్లాడి మనసును తేలికచేసుకుంటాం. తరచూ వ్యాయామం చేస్తాం. ప్రయోగాలు సరేసరి" అంటూ శుక్లా చెప్పుకొచ్చారు. ఇస్రో వారి విద్యార్థి సంవాద్ కార్యక్రమంలో భాగంగా వ్యోమగాములతో విద్యార్థుల మాటామంతీ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. "ఎప్పుడైనా కొన్ని నిమిషాలు తీరిక సమయం దొరికితే వెంటనే కిటికీల వద్దకు వెళ్లి అంతరిక్ష నుంచి మన పుడమిని చూడటం ఎంతో ఆసక్తికరంగా, ఆనందంగా ఉంటుందని ఆయన నాతో చెప్పారు" అని ఒక విద్యార్థి 'పీటీఐ వీడియోస్'తో చెప్పింది.



## ఇంటర్నెట్‌ను ఈ వీడియో కుదిపేయకపోతే మంచిదే!



విజయ్ మాల్యాలలిత్ మోదీ.. ఒకప్పుడు వీవీఐపీలుగా చెలామణి అయిన పెద్ద మనుషులు. ఇప్పుడు భారత ప్రభుత్వం దృష్టిలో ఆర్థిక నేరగాళ్లుగా పరాయి దేశాల్లో తలదాచుకుంటున్న వ్యక్తులు. అయితే ఈ ఇద్దరూ కలిసి ఓ పార్టీలో తెగ ఎంజాయ్ చేస్తూ గడిపిన వీడియో ఒకటి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఐ డిడ్ ఇట్ మై వే అంటూ అలనాటి అమెరికన్ సింగర్ ఫ్రాంక్ సినాత్రా పాడిన ప్రసిద్ధ గీతాన్ని ఐపీఎల్ మాజీ కమిషనర్ లలిత్ మోదీపారిశ్రామికవేత్త విజయ్ మాల్యా కలిసి ఆలపించారు. లండన్‌లో గత ఆదివారం తన నివాసంలో లలిత్ మోదీ ఇచ్చిన పార్టీలో ఇది జరిగింది. ఈ విలాసవంతమైన పార్టీ వీడియోను ఈ వీడియోను లలిత్ మోదీ స్వయంగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. పైగా ముందుగానే ఏం జరుగుతుందో ఊహిస్తూనే.. కాంట్రోవర్శియల్ ఫర్ షూర్.. బట్ దట్స్ వాట్ ఐ డూ బెస్ట్.. అంటూ సందేశం ఉంచారు. ఇప్పుడు నెట్టింట ఈ వీడియో వైరల్ అవుతోంది. ఈ గ్రాండ్ ఈవెంట్‌ను లలిత్ మోదీ తన నివాసంలోనే నిర్వహించారట. ప్రపంచం నలుమూలల నుంచి 310 మందికి పైగా అతిథులు హాజరయ్యారని ఆయన తెలిపారు. వాళ్లలో విధ్వంసకర బ్యాట్స్‌మన్ క్రిస్ గేల్ కూడా ఉన్నారు. ఈ వీడియో ఇంటర్నెట్‌ను కుదిపేయకపోతే మంచిదే. వివాదాస్పదమైతే ఏముంది... అదే నా స్టైల్! అంటూ లలిత్ మోదీ చివర్లో సందేశం ఉంచారు.

## గాల్లో ఉన్న విమానంలో టెన్షన్..
# ప్రయాణికుడిపై ఇషాన్ శర్మ దాడి

**వాషింగ్టన్:** భారత సంతతి ఇషాన్ శర్మ విమానంలో ప్రయాణిస్తున్న మరో ప్రయాణికుడి మధ్య వాగ్వాదం జరిగింది. మాటా మాట పెరిగి చివరకు తన్నుకునే వరకు వెళ్లింది. ఈ క్రమంలో ఇషాన్ తీవ్రంగా గాయపడ్డాడు. విమానం ల్యాండింగ్ అయిన తర్వాత ఇషాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల ప్రకారం.. భారత సంతతి వ్యక్తి ఇషాన్ శర్మ(21) అమెరికాలోని న్యూవార్క్‌లో నివసిస్తున్నాడు. జూలై 1న ఫిలడెల్ఫియా నుంచి ఫ్రాంటియర్ ఎయిర్‌లైన్స్ విమానంలో ప్రయాణించాడు. ఆ విమానం గాలిలో ఉన్న సమయంలో ఇషాన్ శర్మ నవ్వడం, ఏదో మాట్లాడటంపై ముందు సీటులో కూర్చొన్న కీన్ ఎవాన్స్ ఆందోళన చెందాడు. అనంతరం, క్యాబిన్ సిబ్బంది సహాయం కోరే బటన్ నొక్కాడు. అది గమనించిన ఇషాన్ శర్మ.. ఎవాన్స్‌ను అడ్డుకుని అతడి గొంతుపట్టుకుని కొట్టాడు. దీంతో, వారి మధ్య వాగ్వాదం పీక్ స్టేజ్‌కు చేరుకుంది. ఆగ్రహంతో ఎవాన్స్ కూడా తిరిగి శర్మను కొట్టడంతో అతడి కంటికి గాయమైంది. గొడవ పెద్దది కావడంతో విమాన సిబ్బంది వారిద్దరిని నిలువరించారు. ఆ విమానం మయామిలో ల్యాండ్ కాగానే భారత సంతతి వ్యక్తి ఇషాన్ శర్మను అమెరికా



పోలీసులు అరెస్ట్ చేశారు. ఇషాన్ శర్మ తనపై దాడికి ముందు 'హా హ హ హ హ హ' అంటూ నవ్వాడని, తనను కించపర్చడంతోపాటు చస్తావని బెదిరించినట్లు ఎవాన్స్ ఆరోపించాడు. అనంతరం, ఇషాన్ తరుపు న్యాయవాది మీడియాతో మాట్లాడుతూ.. ఇషాన్ శర్మ విమానంలో ధ్యానం చేస్తున్నాడని తెలిపారు. అయితే తనను ఎగతాళి చేస్తున్నట్లు, బెదిరిస్తున్నట్లుగా ఎవాన్స్ భావించడంతో వారిద్దరి మధ్య ఘర్షణ జరిగిందని చెప్పారు. అంతేగానీ, ఉద్దేశపూర్వకంగా ఎవాన్స్‌ను కొట్టలేదని క్లారిటీ ఇచ్చాడు.

# మూడు రోజులు దూరంగా ఉన్నాను.. అప్పుడు అర్థం అయింది: సమంత



నటి సమంత రూటే వేరు. తనకు నచ్చినట్లు ప్రవర్తించే నటీమణుల్లో ఈమె ముందుంటుందని చెప్పవచ్చు. ఎప్పుడూ సోషల్‌మీడియాతో తన అభిమానులకు ఆమె టచ్‌లో ఉంటారు. తనకు నచ్చిన ప్రతి విషయాన్ని ఆమె పంచుకుంటారు. విడాకులు, మయోసైటిస్ ఇలా తన జీవితంలో ఎదురైన క్లిష్ట పరిస్థితుల గురించి కూడా అందులో వ్యక్తపరుస్తూ ఉంటారు. తాజాగా తాను ఎవరూ..? ఎంత పెద్ద సెలబ్రిటీ..? జీవితంలో ఏం సాధించానో తెలుసుకున్నానని చెప్పుకొచ్చారు. విడాకులు పొందిన సమంత ఆ తరువాత మయోసైటిస్ అనే అరుదైన వ్యాధికి గురై దాని నుంచి బయట పడటానికి పెద్ద పోరాటమే చేశారు. అలా చాలా కాలం నటనకు దూరం అయిన ఈమె మళ్లీ నటించడానికి సిద్ధం అయ్యారు. అలా వెబ్ సిరీస్‌లో నటించిన సమంత ఇటీవల నిర్మాతగానూ అవతారమెత్తి శుభం అనే చిత్రాన్ని నిర్మించారు కూడా. ఇలా నిత్యం సామాజిక మాధ్యమాల్లో యాక్టీవ్‌గా ఉంటున్న సమంత తాజాగా సామాజిక మాధ్యమాల్లో మరో టీట్ చేశారు. అందులో తన చేతిలో ఎప్పుడూ సెల్‌ఫోన్ ఉంటుందన్నారు. దీంతో సడన్‌గా తనకొక ఆలోచన వచ్చిందనీ, దీంతో వెంటనే తన సెల్‌ఫోన్‌ను మూడు రోజుల పాటు స్విచ్ఛ్ ఆఫ్ చేసినట్లు చెప్పారు. ఆ మూడు రోజులు ఎవరితోనూ మాట్లాడలేదనీ, ఎవరినీ చూడలేదనీ, పుస్తకాలు చదవడం, రాయడం వంటివేవీ చేయలేదన్నారు. ఇంకా చెప్పాలంటే ఏ పని చేయలేదన్నారు. అలా మూడు రోజులు మెదడుకు పూర్తిగా విశ్రాంతినిచ్చినట్లు చెప్పారు. ఆ అనుభవం చాలా కొత్తగా ఉందన్నారు. తన ఈగోలో చాలా భాగం తన సెల్‌ఫోన్‌తోనే అన్నది అప్పడు అర్థం అయ్యిందన్నారు. తాను ఎవరూ? ఎంత సెలబ్రిటీనీ? ఏం సాధించాను? అన్న విషయాలు తన సెల్‌ఫోన్‌నే చెబుతుందన్నారు. అది లేని రోజున తాను ఒక సాధారణ జీవినని అనే భావన కలిగిందన్నారు. పుట్టుకకు గిట్టుటకు మధ్య కాలంలో సెల్‌ఫోన్ మనకు ప్రకృతికి చెందిన విషయాలను కనుమరుగు చేసిందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మన పెద్దలకు, ఆరోగ్యానికి సెల్‌ఫోన్ ఎంత ఆటంకంగా మారిందన్నది అవగతం చేసుకున్నానని నటి సమంత అన్నారు. ఈమె చేసిన పోస్ట్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

# నాపై ఎందుకింత అసూయ




విచిత్రమైన దుస్తుల వేషధారణతో ఫేమ్ తెచ్చుకున్న బాలీవుడ్ బ్యూటీ ఉర్ఫీ జావెద్. ఆ తర్వాత బిగ్‌బాస్‌లోనూ మెరిసింది. ఇటీవల కరణ్ జోహార్ హోస్ట్ చేసిన ది ట్రైటర్స్ అనే షోలోనూ కనిపించింది. అమెజాన్ ప్రైమ్‌లో ప్రసారమైన ఈ షోలో చాలామంది కంటెస్టెంట్స్‌గా పాల్గొన్నారు. అయితే చివరికీ రియాలిటీ టీవీ షో 'ది ట్రెయిటర్స్' విజేతగా ఉర్ఫీ జావెద్ నిలిచింది. అయితే ది ట్రైటర్స్ విజేతగా నిలిచిన ఉర్ఫీ జావెద్‌కు సోషల్ మీడియాలో ట్రోల్స్ మొదలయ్యాయి. కొందరు నెటిజన్స్ చాలా అసభ్యకరంగా సందేశాలు పంపారు. ఈ విషయాన్ని ఉర్ఫీ తన ఇన్‌స్టా వేదికగా పోస్ట్ చేసింది. తనపై వస్తున్న కామెంట్స్‌ను స్క్రీన్ షాట్ రూపంలో షేర్ చేసింది. తనకు ఇలా జరగడం ఇదేమీ మొదటిసారి కాదని అంటోంది.

ఉర్ఫీ జావెద్ తన ఇన్‌స్టాలో రాస్తూ.. 'ఒక అమ్మాయి చేసే పని మీకు నచ్చకపోతే ఆర్ అనే పదాన్ని కామెంట్స్‌లో వదిలేయండి. నన్ను ఇలా బెదిరించడం, అసభ్యకరంగా మాట్లాడడం ఇదేం మొదటిసారి కాదు. కానీ ఈసారి నా దుస్తుల వల్ల కాదు.. నేను ఒక షో గెలిచినందు వల్ల. మీ అభిమానించే ఆటగాడు గెలవకపోతే నన్ను బెదిరించడం లాంటివి ఊహించుకోండి. నేను అప్‌లోడ్ చేసిన వాటిలో ఇవి చాలా డీసెంట్ కామెంట్స్. నేను ఏం చేసినా, ప్రజలు ద్వేషించడం, అసభ్యకరంగా కామెంట్స్ చేయడాన్నే ఇష్టపడుతున్నారు. ఇలాంటి ద్వేషం చూపిస్తూ చేసే మీ కామెంట్స్ నన్ను ఇంతకు ముందు ఎప్పుడూ ఆపలేదు.. ఇకపై ఎప్పటికీ ఆపలేవు కూడా' అంటూ తన పోస్ట్‌లో రాసుకొచ్చింది.

కాగా.. అంతకుముందే తాను 'ది ట్రెయిటర్స్' గెలవడం వరకు జరిగిన ప్రయాణాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసింది. నా ఈ ప్రయాణం సులభం కాదని.. ఎన్నోసార్లు ఏడ్చానని తెలిపింది. జీవితంలో చాలా బాధలు ఎదురయ్యాయి.. ఒకానొక సమయంలో అన్ని వదిలేసి పారిపోవాలనుకున్నానని పేర్కొంది. తనకు చాలా బెదిరింపులు, అత్యాచార బెదిరింపులు, నాపై ఎంతోమందికి ద్వేషం ఉన్నప్పటికీ ఎక్కడా వెనకడుగు వేయలేదని రాసుకొచ్చింది. 'బిగ్ బాస్‌లో ఓడిపోయినప్పుడు మంచి జీవితాన్ని గడపడానికి నా చివరి అవకాశాన్ని కోల్పోయానని అనిపించిందని తెలిపింది. బిగ్ బాస్‌కు వెళ్లేముందు బట్టలు కొనడానికి స్నేహితుల నుంచి రుణం కూడా తీసుకున్నా.. ఆ సమయంలో నేను తిరిగి చెల్లించగలనో కూడా నాకు తెలియదని ఉర్ఫీ చెప్పుకొచ్చింది.

# భారత్‌లో అత్యంత ఖరీదైన చిత్రం ఇదే..



బాలీవుడ్‌లో తెరకెక్కుతున్న 'రామాయణ' సినిమా గురించి ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చించుకుంటున్నారు. తాజాగా విడుదలైన గ్లింప్స్ విజువల్స్ అద్భుతంగా ఉన్నాయంటూ గ్రాఫిక్స్ వర్క్‌పై ప్రశంసలు అందుతున్నాయి. ఈ మూవీ భారతదేశంలోనే అత్యంత ఖరీదైనదిగా రికార్డ్ నెలకొల్పనుంది. మానవ సమాజ గతినే ప్రభావితం చేసిన ఒక మహత్తర కావ్యం రామాయణం. ఈ కావ్యాన్ని ఆధారం చేసుకుని ఇప్పటికే పలు సినిమాలు వచ్చాయి. కానీ, గ్రాఫిక్స్ వర్క్ ప్రధాన బలంగా ఒక అద్భుతాన్ని దర్శకుడు నితేశ్ తివారీ వెండితెరపై చూపించనున్నాడు. రామాయణం మధురమైన కథ. ఎన్నిసార్లు రామాయణం చదివినా, విన్నా కొత్తగా అనిపిస్తుంది. అందుకే ఇప్పటికే పలుమార్లు సినిమాగా వెండితెరపై మెరిసింది. ఇప్పుడు మరోసారి బాలీవుడ్‌లో 'రామాయణ' పేరుతో అత్యంత భారీ బడ్జెట్ పేరుతో సినిమా వస్తుంది.

**భారతీయ సినీ చరిత్రలో అత్యంత బడ్జెట్ చిత్రంగా 'రామయణ'**

అన్ని యుద్ధాల్ని అంతం చేసే యుద్ధం మొదలైందని తాజాగా విడుదలైన రామయణ గ్లింప్స్‌లో మేకర్స్ పేర్కొన్నారు. అదేవిధంగా ఈ చిత్రంతో బాక్సాఫీస్ రికార్డ్‌లు అన్నీ అంతం కావడమే కాకుండా కొత్త రికార్డ్ మొదలైంది. రామయణ పార్ట్ 1 కోసం ఏకంగా రూ. 835 కోట్ల బడ్జెట్ ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో దేశంలోనే అత్యంత ఖరీదైన సినిమాగా 'రామాయణ' చరిత్ర సృష్టించింది. రాకింగ్ స్టార్ యశ్ నిర్మాణ సంస్థ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, అలాగే నమిత్ మల్హోత్రా నిర్మాణ సంస్థ ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ సంయుక్తంగా కలిసి ఈ మూవీని నిర్మిస్తున్నాయి. ఇప్పటివరకు అత్యధిక బడ్జెట్ చిత్రాలుగా నిలిచిన కల్కి 2898 ఏడీ (రూ. 600 కోట్లు), ఆర్‌ఆర్‌ఆర్ (రూ. 550 కోట్లు), ఆదిపురుష్ (రూ. 550 కోట్లు) వంటి చిత్రాలను రామాయణ అధిగమించింది.

**భారీ తారాగణం**

రామాయణ సినిమాలో రాముడి పాత్రలో బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్, సీత పాత్రలో సాయి పల్లవి నటిస్తున్నారు. లంకాధిపతి రావణుడి పాత్రలో 'కేజీఎఫ్' ఫేమ్ యశ్ కనిపించనున్నారు. రవి దూబే (లక్ష్మణుడు), సన్నీ డియోల్ (ఆంజనేయుడు)గా కనిపించనున్నారు. వీరితో పాటు వివేక్ ఒబెరాయ్, రకుల్ ప్రీత్ సింగ్, లారా దత్తా, కాజల్ అగర్వాల్, అరుణ్ గోవిల్, షీబా చద్దా వంటి సూపర్‌స్టార్స్ ఈ మూవీ కోసం పనిచేస్తున్నారు. దంగల్ సినిమాతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నితేశ్ తివారీ దర్శకత్వంలో ఈ భారీ ప్రాజెక్ట్ తెరకెక్కుతుంది.

**ఎనిమిది ఆస్కార్ అవార్డ్స్ అందుకున్న సంస్థతో మ్యాజిక్**

ఈ మూవీ కోసం ఉత్కంఠభరితమైన విజువల్ ఎఫెక్ట్‌లను మేకర్స్ అందించనున్నారు. అందు కోసం కోట్ల రూపాయలే ఖర్చుచేస్తున్నారు. ప్రపంచంలోనే గుర్తింపు పొందిన బ్రిటిష్‌ఇండియన్ VFX కంపెనీ ఈ ప్రాజెక్ట్ కోసం పనిచేస్తుంది. ఈ సంస్థ ఇప్పటికే ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్‌కు గాను ఎనిమిది ఆస్కార్ అవార్డ్‌లను గెలుచుకుంది. ఆపై ఈ మూవీకి హాలీవుడ్ సంగీత దర్శకుడు హన్స్ జిమ్మెర్ పనిచేస్తున్నారు. ఆయన గ్లాడియేటర్, ఇంటర్ స్టెల్లర్, ది లయన్ కింగ్, డ్యూన్ వంటి టాప్ చిత్రాలకు సంగీతం అందించారు. ఆర్ రెహమాన్ కూడా రామయణ చిత్రానికి సంగీతంలో భాగం పంచుకోవడం విశేషం.

# సైకో కిల్లర్‌గా చేయాలని ఉంది: వర్ష బొల్లమ్మ



"హీరోయిన్‌గా కొన్ని సినిమాలు చేశాను. అయితే క్యారెక్టర్ ఆర్టిస్టుగా అవకాశం వచ్చినా చేస్తాను. స్క్రీన్‌పై వర్ష బాగా నటిం చిందనే పేరు తెచ్చుకుంటే చాలు. ఉదాహరణకు నిత్యా మీనన్‌గారికి మంచి పెర్ఫార్మర్‌గా పేరుంది. ఆమెలా పేరు తెచ్చుకోవాలని ఉంది. 'తమ్ముడు' కథ విన్నప్పుడు, ఈ సినిమాలో నేను చేసిన చిత్ర క్యారెక్టర్ కొత్తగా అనిపించింది. సవాల్‌గా తీసుకుని, ఈ సినిమా చేశాను" అని హీరోయిన్ వర్ష బొల్లమ్మ అన్నారు. నితిన్ హీరోగా నటించిన యాక్షన్ చిత్రం 'తమ్ముడు'. ఈ చిత్రంలో లయ, సప్తమీ గౌడ, వర్ష బొల్లమ్మ, బాల నటి శ్రీరామ్ దిత్య ఇతర కీలక పాత్రల్లో నటించారు. శ్రీరామ్ వేణు దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకరుల సమావేశంలో వర్ష బొల్లమ్మ మాట్లాడుతూ– "అక్కాతమ్ముడు సెంటిమెంట్ నేపథ్యంలో సాగే సినిమా 'తమ్ముడు'. కానీ కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. ఈ సినిమాలో నితిన్ క్యారెక్టర్ జైకి ఓ డ్రైవింగ్ ఫోర్స్‌లా ఉంటుంది చిత్ర పాత్ర. ఏదైనా చేయాలనుకుంటే వెంటనే చేసేయాలనుకునే మనస్తత్వం చిత్రది. ఈ సినిమా కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నాను. ఇక ఓ సైకో కిల్లర్ రోల్ చేయాలన్నది నా ఆకాంక్ష. ప్రస్తుతం 'కానిస్టేబుల్ కనకం' వెబ్ సిరీస్, మరో వెబ్ సిరీస్‌లో నటిస్తున్నాను. మరో రెండు సినిమాలు ఉన్నాయి" అని అన్నారు.

# రెండో భర్తతోనూ విడాకులు..

## అందుకేనన్న బాలీవుడ్ నటి!



పలు సూపర్ హిట్ సినిమాల్లో మెప్పించిన బాలీవుడ్ నటి చాహత్ ఖన్నా. తన అందం, అద్భుతమైన నటనతో అభిమానులను సంపాదించుకుంది. బాలీవుడ్‌లో ద ఫిలిం, థాంక్యూ, ప్రస్థానం, యాత్రిస్ సినిమాలతో పాటు బుల్లితెరపై కాజల్, ఖుబూల్ హై వంటి సీరియల్స్‌లో చాహత్ నటించింది. అయితే 2006లో భరత్ నర్సింగనిని పెళ్లాడిన ముద్దుగుమ్మ.. నాలుగు నెలలకే విడాకులిచ్చింది. ఆ తర్వాత 2013లో ఫర్హాన్ మీర్జాను పెళ్లాడగా 2018లో అతనితో కూడా తెగదెంపులు చేసుకుంది. రెండుసార్లు పెళ్లి చేసుకోగా రెండుసార్లూ విడాకులే తీసుకుంది చాహత్ ఖన్నా. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన ఆమె రెండోసారి విడాకులు తీసుకోవడంపై మాట్లాడింది. కేవలం తన పిల్లల భవిష్యత్తు కోసమే ఈ నిర్ణయం తీసుకున్నానని అంటోంది.

రెండోసారి విడాకుల గురించి చాహత్ మాట్లాడుతూ.. 'నేను ఎప్పుడూ నాకు సరైనది అనిపించిన దాన్నే చేశా. దానికే కట్టుబడి ఉంటా. ఏదైనా తప్పని అనిపిస్తే అలాంటి పని చేయను. ఎవరైనా తప్పు చేస్తుంటే కూడా చెప్పే ధైర్యం నాకు ఉంది. ప్రపంచం ఏమి చెప్పినా నేను ఎప్పుడూ తప్పును సమర్థించను. మీకు ఆ రకమైన నమ్మకం, ధైర్యం, ఆత్మగౌరవం ఉండాలి. కేవలం ఒక మహిళగా మాత్రమే కాదు, ఒక మనిషిగా.. ఏదైనా కరెక్ట్ కాదనిపిస్తే అందులో భాగం కాలేను. అలాంటి వాటికి నేను దూరంగా వెళ్తాను. అలాగే మనం పిల్లల కోసం ఆలోచిస్తూ మనకు సరిగాలేని వివాహ బంధంలో ఉండిపోకూడదు. ఎందుకంటే పిల్లలు మనకంటే ఎక్కువగా ప్రభావితమవుతారు. అది కలిగించే నష్టం మీకు కూడా తెలియదు. వారు పెద్దయ్యాక వారి స్నేహితుల నుంచి విన్నప్పుడు మాత్రమే మీకు తెలుస్తుంది. అందుకే నా కుమార్తెల కోసం నేను దూరంగా వెళ్లాలని నిర్ణయించుకున్నా' అని తెలిపింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com